04-10-25 Samayam_Layout 1 10/4/2025 4:41 AM Page 1


S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267


# సమయం

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

సంపుటి: 19 | సంచిక: 05 | ఎడిటర్ : విక్రం కుమార్ | శనివారం 4 అక్టోబర్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |



సమయం
విలేకరులు కావలెను
ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

## విదేశీ విద్యార్థులపై ట్రంప్ కొరడా

పరిమిత సంఖ్యలోనే విద్యార్థులకు అడ్మిషన్లు
యూనివర్సిటీలకు హుకూం జారీచేసిన వైట్‌హౌజ్

.. వివరాలు 4లో



## కరూర్ తొక్కిసలాట ఘటనపై సిట్

తమిళనాడు నార్త్ జోన్ ఐజీ అస్రాగార్గ్ నేతృత్వం
రాష్ట్ర, జాతీయ హైవేలపై రాజకీయ పార్టీల సభల నిషేధం
మద్రాస్ హైకోర్టు కీలక ఆదేశాలు

.. వివరాలు 4లో

## పెద్దనాన్న లైంగిక వేధింపులు

ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం

.. వివరాలు 2లో

# మాజీ మంత్రికి సీఎం నివాళి

- కాంగ్రెస్ పెద్ద నాయకుడిని కోల్పోయిందని సీఎం వెల్లడి
- దామోదర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి

మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి భౌతికకాయానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. దామోదర్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులు అర్పించి, ఆయన కుటుంబ సభ్యులను సీఎం పరామర్శించారు.

2





# ఫలక్‌నుమా ఆర్వోబీ ప్రారంభం

### పాతబస్తీ ట్రాఫిక్‌సమస్యకు పరిష్కారం

### లాంఛనంగా ఓపెనింగ్ చేసిన మంత్రి పొన్నం


చంద్రాయణగుట్ట నియోజకవర్గం, పాతబస్తీ వాసులకు ఇక ట్రాఫిక్ కష్టాలు తీరాయి. హైదరాబాద్‌లోని పాతబస్తీ వాసుల ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు ఫలక్‌నుమాలో మంత్రి పొన్నం ప్రభాకర్ కొత్త రోడ్ ఓవర్ బ్రిడ్జిని ప్రారంభించారు. ఫలక్‌నుమా రైల్వే ట్రాక్‌పై పాత ఆర్‌ఓబీ ఇరుకుగా మారడంతో, దానికి సమాంతరంగా కొత్తగా మరో బ్రిడ్జిని నిర్మించింది జీహెచ్ఎంసీ. రూ. 52.3 లక్షల వ్యయంతో, 360 మీటర్ల పొడవుతో రెండు లైన్స్‌గా ఈ రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మించారు. దీంతో బార్కాస్ జంక్షన్ నుంచి ఫలక్‌నుమా బస్ డిపో వరకూ ట్రాఫిక్ కష్టాలను తగ్గనున్నాయి.

2

# రేవంత్ రెడ్డిని వదిలిపెట్ట

- వచ్చే అసెంబ్లీ ఓడించి తీరుతా
- రాహుల్, మోడీ ఆయనను కాపాడలేరు
- ప్రశాంత్ కిషోర్ మండిపాటు

2



# మద్యం విక్రయాలకు దసరా కిక్కు

పండగతో భారీగా అమ్మకాలు



2

# కాంగ్రెస్ పాలనలో ఆర్థిక విధ్వంసం

- జీఎస్టీ వసూళ్ల వృద్ధిలో దేశంలోనే అట్టడుగుకు..
- రేవంత్ అనుభవలేమి, అరాచకత్వమే కారణం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్



3

# 'విలువలతో కూడిన వృద్ధి'కి కేరాఫ్ తెలంగాణ

- పారిశ్రామికాభివృద్ధికి అనుకూలం, అవకాశాల ఖని
- పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ఆహ్వానం
- 'జీటో కనెక్ట్ 2025' ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు
- కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, కిషన్‌రెడ్డి హాజరు

02





# పాక్ ఉగ్రవాదాన్ని ఎగదోస్తే గట్టి సమాధానం

### ప్రపంచపటంలో పేరు లేకుండా చేస్తాం

### ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరిక

**న్యూఢిల్లీ :** ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దాయాది దేశం పాకిస్థాన్ కు ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది శుక్రవారం నాడు దిమ్మతిరిగే వార్నింగ్ ఇచ్చారు. భారత్‌లో ఉగ్రవాదాన్ని స్పాన్సర్స్ చేసే చర్యలను పాక్ మానుకోకుంటే ఆ దేశం ప్రపంచ పటం నుంచి

మిగతా 2 లో

# ఆటో డ్రైవర్లకు సాయం

### విజయవాడలో నేడు సీఎం చంద్రబాబు శ్రీకారం

- అమరావతి అభివృద్ధి పనుల వేగవంతానికి ఎస్‌పీవీ ఏర్పాటు
- అమరావతిలో ఇక భూ సేకరణ ద్వారా భూముల సమీకరణ
- 16న ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లపై మంత్రులకు దిశానిర్దేశం
- జలవనరుల శాఖ పనులకు కేబినేట్ గ్రీన్ సిగ్నల్



**అమరావతి :** ఆటో, క్యాబ్ డ్రైవర్లకు రూ.15వేల ఆర్థిక సాయం అందించే పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం లాంఛనంగా ప్రారంభించనున్నారు. విజయవాడ సింగ్ నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో ఈ పథకాన్ని సీఎం ప్రారంభిస్తారు. ఈ మేరకు పథకం ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ సమావేశమై 20 అజెండా అంశాలపై చర్చించింది. ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్నికల్ హబ్స్ (లిఫ్ట్) పాలసీ 2024-29 అనుబంధ ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. జలవనరుల శాఖకు సంబంధించి వివిధ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కారవాన్ పర్యాటకానికి, అమృత్ పథకం 2.0 పనులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాజధాని

మిగతా 5 లో

# అందరం కలిసి ఉండాలన్నదే అలయ్ బలయ్

- కులమతాలతో పబ్బం గడుపుకోవాలనుకుంటే కుదరదు
- ఎక్కడో ఏదో జరిగిందని .. ఇక్కడా జరుగుతుందటే పొరపాటు
- భిన్నత్వంలో ఏకత్వం మన బలం అన్న వెంకయ్య



**హైదరాబాద్, అక్టోబర్ 3:** వేషభాషలు వేరయినా అందరం భారతీయులమనే భావనతో కలిసి ముం ఓదుకెళ్తున్నామని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి ఆధ్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించిన 'అలయ్ బలయ్' కార్యక్రమం నిర్వహించారు. తొలుత వెంకయ్యనాయుడు మాట్లాడుతూ అందరం కలిసి ఉండాలనేది అలయ్ బలయ్ ఉద్దేశమన్నారు. 20ఏళ్లుగా బండారు దత్తాత్రేయ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని కొనియాడారు.

3

# ఏపీలో ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

ఫిబ్రవరి 23 నుంచి ఫస్ట్ ఇయర్, 24నుంచి సెకండ్ ఇయర్ పరీక్షలు



2



# పెద్దనాన్న లైంగిక వేధింపులు

## కొంపల్లిలో ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం

**హైదరాబాద్, అక్టోబర్3:** హైదరాబాద్ నగరంలోని కొంపల్లిలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కంటికి రెప్పలా కాపాడాల్సిన పెదనాన్న నుంచే లైంగిక వేధింపులు ఎదురుకావడంతో వాటిని భరించలేని ఓ 17 ఏళ్ల ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ హృదయ విదారక ఘటన పోచమ్మగడ్డ ప్రాంతంలో గురువారం రాత్రి జరిగింది. పేట్ బషీరాబాద్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, నిజామాబాద్ జిల్లా వర్నికి చెందిన ఓ కుటుంబం ఉపాధి కోసం కొంపల్లికి వలస వచ్చి నివసిస్తోంది. ఈ దంపతుల పెద్ద కుమార్తె (17) స్థానికంగా ఉన్న ఓ కార్పొరేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతోంది. గతేడాది రోడ్డు ప్రమాదంలో బాలిక తండ్రి మరణించారు. ఆయన బతికున్నప్పుడు తన అన్నతో కలిసి మేడ్చల్‌లో ఫైనాన్స్‌లో కొంత రుణం తీసుకున్నారు. తండ్రి మరణం తర్వాత, ఆ అప్పు విషయం మాట్లాడాలనే నెపంతో పెదనాన్న తరచూ తమ్ముడి ఇంటికి రావడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి బాలికను లైంగికంగా వేధించేవాడు. అతని వేధింపులు రోజురోజుకు ఎక్కువ కావడంతో ఆ బాలిక తీవ్ర మనోవేదనకు గురైంది. ఈ నరకాన్ని భరించలేక, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ప్రాణాలు తీసుకుంది. విషయం తెలుసుకున్న బాలిక తల్లి గుండెలవిసేలా రోదించింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై సమగ్రంగా దర్యాప్తు జరుపుతున్నట్లు వారు వెల్లడించారు.

# మద్యం విక్రయాలకు దసరా కిక్కు

## పండగతో భారీగా అమ్మకాలు



**హైదరాబాద్, అక్టోబర్ 3:** తెలంగాణలో మద్యం విక్రయాలు భారీగా పెరిగాయి. దసరా కిక్కు ఇచ్చింది. అక్టోబర్ 2న దసరా రావడంతో ముందస్తుగానే 30, 1 తేదీల్లో భారగా మద్యం విక్రాయలు జరిగాయి. ఈ ఏడాది సెప్టెంబరులోనే రూ.3,046 కోట్ల మేర మద్యం అమ్మకాలు జరిగాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబరు 29న రూ.278 కోట్లు, 30న రూ.333 కోట్లు, అక్టోబర్ 1న రూ.86.23 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. గతేడాదితో పోలిస్తే ఈ 3 రోజుల్లోనే 60 నుంచి 80శాతం వరకు అమ్మకాలు పెరిగాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు.. రాష్ట్ర వ్యాప్తంగా 29.92 లక్షల కేసుల లిక్కర్, 36.46 లక్షల కేసుల బీర్లు విక్రయించారు. గతేడాదితో పోలిస్తే 7శాతానికిపైగా మద్యం విక్రయాలు పెరిగాయి. మద్యం సేల్స్ పెరగడంతో ఎక్సైజ్ శాఖకు రాబడి పెరిగింది.

# పాక్ పేరు లేకుండా చేస్తాం

## ఉగ్రవాదాన్ని ఎగదోస్తే గట్టి సమాధానం

## ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరిక



**న్యూఢిల్లీ, అక్టోబర్ 3 :** ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దాయాది దేశం పాకిస్థాన్ కు ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది శుక్రవారం నాడు దిమ్మతిరిగే వార్నింగ్ ఇచ్చారు. భారత్‌లో ఉగ్రవాదాన్ని స్పానర్స్ చేసే చర్యలను పాక్ మానుకోకుంటే ఆ దేశం ప్రపంచ పటం నుంచి కనుమరుగవుతుందని హెచ్చరించారు. భారత బలగాలు ఆపరేషన్ సిందూర్లో చూపించిన సంయమనాన్ని ప్రతిసారీ చూపించలేవని అన్నారు. ఈసారి నిర్ణయాత్మక, అత్యంత శక్తివం తమైన సమాధానం ఇస్తుందని చెప్పారు. 'ఆపరేషన్ సిందూర్ 1.0లో చూపిన సంయ మనాన్ని ఈసారి చూపించం. ప్రపంచ పటంలో ఉండాలనుకుంటోందో, లేదో తేల్చుకునేలా ఈసారి పాకిస్థాన్‌కు గట్టి సమాధానం ఉంటుంది. ప్రపంచ పటంలో పాక్ ఉండదలిస్తే మాత్రం ఉగ్రవాదాన్ని స్పాన్సర్ చేయడం ఆపితీరాలి' అని జనరల్ ద్వివేది అన్నారు. బికనీర్ మిలట్రీ స్టేషన్‌తో సహా పలు ఫార్వార్డ్ ఏరియాల్లో శుక్రవారం నాడు ఉపేంద్ర ద్వివేది పర్యటించారు. బలగాల సన్నద్ధతను అంచనా వేసేందుకు ఆయన ఈ పర్యటన చేపట్టారు. మిలట్రీ సీనియర్ అధికారులు, వెటరన్స్, సివిల్ డిగ్నటరీలతో ఆయన సమావేశం అయ్యారు. ఆధునికీకరణ, యుద్ధ సన్నాహకాలు, అడ్వాన్సింగ్ టెక్నలాజికల్ సామర్థ్యాలు, ఆపరేషనల్ ఎక్సలెన్స్‌కు ఆర్మీ కృతనిశ్చయంతో ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

# బాపూఘాట్ వద్ద గాంధీజయంతి



**హైదరాబాద్,అక్టోబర్ 3:** జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా హైదరాబాద్ లంగర్ హౌస్ లోని బాపూఘాట్ వద్ద గవర్నర్ జిష్ణు దేవ్ వర్మతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. బాపూఘాట్ వద్ద నివాళులు అర్పించిన వారిలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా బాపూఘాట్ వద్ద సర్వమత ప్రార్థనల్లో గవర్నర్ పాల్గొన్నారు. దసరా రోజు కూడా కావడంతో గవర్నర్ తదితరులు పాల్గొని శుభకాంక్షలు తెలిపారు.

# దామోదర్ రెడ్డికి సీఎం రేవంత్ నివాళి

## కాంగ్రెస్ పెద్ద నాయకుడిని కోల్పోయిందని వెల్లడి



**హైదరాబాద్, అక్టోబర్ 3:** మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి భౌతికకాయానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు నివాళులు అర్పించారు. హైదారాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ దామోదర్‌రెడ్డి బుధవారం రాత్రి మృతిచెందారు. ప్రజల సందర్శనార్థం ఇవాళ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో భౌతికకాయాన్ని ఉంచారు.దామోదర్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులు అర్పించి, ఆయన కుటుంబ సభ్యులను సీఎం పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రైతు కమిషన్ ఛైర్మన్ కోదండ రెడ్డి తదితరులు ఉన్నారు. దామోదర్ రెడ్డి, తాను ఒకేసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికై అసెంబ్లీలో అడుగుపెట్టామని, ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని కోదండరెడ్డి కొనియాడారు. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు ఉన్నాయని... కోలుకుని తిరిగి పార్టీలో ఉంటారని తాము భావించామన్నారు. ఆయన మృతి ఉమ్మడి నల్గొండ జిల్లాకే కాదు తెలంగాణ రాష్ట్రానికి తీరని లోటని పేర్కొన్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఖమ్మం జిల్లా, లింగాల గ్రామంలో జన్మించిన దామోదర్ రెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో నల్గొండ జిల్లా, తుంగతుర్తి నియోజకవర్గం నుంచి నాలుగు పర్యాయాలు ఎంఎల్ఎగా ఎన్నికయ్యారు. సూర్యాపేట నుంచి ఒక పర్యాయం ఎంఎల్ఎగా విజయం సాధించారు. 2023 చివరలో జరిగిన ఎన్నికల్లో సూర్యాపేట నియోజకవర్గంలో నుంచి పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమిపాలయ్యారు. దామోదర్‌రెడ్డిని ఆయన అభిమానులు 'టైగర్' అని ముద్దుగా పిలుచుకుంటారు. ఆయన అంత్యక్రియలు తుంగతుర్తి నియోజకవర్గం కేంద్రంలో ఈ నెల 4వ తేదీన నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. దామోదర్ రెడ్డి పార్థివదేహాన్ని కడసారి సందర్శించేందుకు సూర్యాపేటలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేస్తున్నారు. దామోదర్ రెడ్డి మరణం పట్ల సిఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఆయన మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని అన్నారు.

# ఫలక్‌నుమా ఆర్వోబీ ప్రారంభం

## లాంఛనంగా ఓపెనింగ్ చేసిన మంత్రి పొన్నం

**హైదరాబాద్, అక్టోబర్ 3:** జీహెచ్ఎంసీ నిధులు రూ 52.03 కోట్ల వ్యయంతో నిర్మించిన సికింద్రాబాద్ – ఫలక్‌నుమా బ్రాడ్‌గేజ్ లైన్‌లోని ఫలక్‌నుమా వద్ద ఆర్ఓబీకి సమాంతర ఆర్ఓబీని శుక్రవారం హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసుదుద్దీన్ ఒవైసీ , ఎమ్మెల్సీలు మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండీ, మీర్జా రహమత్ బేగ్ , ఎమ్మెల్యేలు మహమ్మద్ ముబీన్, మీర్ జల్ఫికర్ అలీ ,జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, చార్మినార్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్ లు,తదితరులు పాల్గొన్నారు.

### తీరనున్న ట్రాఫిక్ కష్టాలు

పాతబస్తీ ఫలక్ నామాలో నేటి నుంచి ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. సికింద్రాబాద్ నుంచి ఫలక్ నామా బ్రాడ్ గేజ్ లైన్ వద్ద ఉన్న ఆర్వోబీకి సమాంతరంగా జీహెచ్ఎంసీ ఆర్వోబీ నీ నిర్మించింది. రూ.52. కోట్లతో 4 వరుసల్లో ఆర్వోబీని జీహెచ్ఎంసీ నిర్మించింది. పాత ఆర్వోబీని పునరుద్ధరించడంతో పాటు దానికి సమాతరంగా మరో ఆర్వోబీని నిర్మించడంతో బార్కస్ జంక్షన్ నుంచి ఫలక్ నామా బస్ డిపో, రైల్వే స్టేషన్, చార్మినార్ వైపు వెళ్లే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తొలగనున్నాయి. సమయం ఆదాతోపాటు గంటల తరబడి నిలిచిపోయే ట్రాఫిక్ నుంచి ఊరట లభించనుంది. ఫలక్‌నుమా ఆర్ఓబీనీ ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ఎస్ఆర్డీపీ పనుల సత్ఫలితాలు

గత ప్రభుత్వంలో 5937 కోట్ల రూపాయల అంచనాతో 42 పనులకు ప్రతిపాదించారు. ఇప్పటివరకు 39 పనులు అందుబాటులోకి రావడం జరిగింది. మిగతా మూడు పనులు పూర్తి కావడానికి మరో సంవత్సరం లో పూర్తి చేయనున్నారు. నల్గొండ ఎక్స్ రోడ్డు నుండి ఒవైసీ హాస్పిటల్ వరకు శాస్త్రి పురం రైల్వే ఓవర్ బ్రిడ్జి, ఉప్పల్ ఫ్లై ఓవర్ అసంపూర్తిగా ఉన్నాయి. ఆ పనులు పూర్తయ్యితే ఎస్ఆర్డీపీ పనులు పూర్తి అవుతాయి.

హెచ్ సిటీ ద్వారా చేపట్టనున్న మొత్తం పనులు గత ప్రభుత్వంలో ఎస్ ఆర్ డి పి ద్వారా రెండోదశ ప్రతిపాదనల



పనులను తీసుకున్నారు. ప్రజా పాలన ప్రభుత్వంలో దానికి కొత్త పేరు హెచ్ సిటీ పథకం రూప కల్పన చేసే అట్టహాసంగా ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా అన్ని పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి శంకు స్థాపన చేసి యేడాది కావస్తున్న ఒకే ఒక పని ప్రారంభం అయ్యింది. అది కూడా జాతీయ రహదాని నుండి అమీన్ పూర్ వరకు గత నెల రాష్ట్ర మంత్రి డి శ్రీధర్ బాబు శ్రీకారం చుట్టిన మిగతా పనులు ఒక్కటి కూడా మొదలు పెట్టలేదు. గత ప్రభుత్వంలో చేపట్టిన ఫ్లై ఓవర్లు, అండర్ పాసులు ఆర్ఓబిలా వాహన రద్దీ తగ్గించడం రోడ్డు రవాణా మెరుగు పడింది అందుకు తగ్గట్టు వాహన వేగం పెరిగి వాహన దారులకు ఇబ్బందులు తగ్గిందని చెప్పక తప్పదు..

# 'విలువలతో కూడిన వృద్ధి'కి కేరాఫ్ తెలంగాణ



**హైదరాబాద్, అక్టోబర్ 3 :** 'విలువలతో కూడిన వృద్ధి'కి కేరాఫ్ గా తెలంగాణ దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా మారిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. పారిశ్రామికాభివృద్ధికి అత్యంత అనుకూలంగా ఉన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను కోరారు. జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్(జీటో) హైదరాబాద్ ఛాప్టర్ ఆధ్వర్యంలో హైటెక్స్, హెచ్ఐసీసీలలో మూడ్రోజుల పాటు నిర్వహించనున్న 'జీటో కనెక్ట్ 2025'ను కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, కిషన్ రెడ్డి తో కలిసి శుక్రవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకప్పుడు పారిశ్రామికవేత్తలు ప్రభుత్వాలిచ్చే రాయితీలు, ప్రోత్సాహకాలను చూసే పెట్టుబడులు పెట్టేవారన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఇప్పుడు వారి ఆలోచన తీరు కూడా మారిందన్నారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటన్నారన్నారు. ముఖ్యంగా వృద్ధి నైతిక మైనదా, సమ్మిళితమైనదా, సుస్థిరమైనదా..? అని అధ్యయ నం చేసిన తర్వాతే అడుగు ముందుకేస్తున్నారన్నారు. భవి ష్యత్తు కోసం ఎదురు చూడకుండా, భవిష్యత్తునే తెలంగాణ నిర్మిస్తోందన్నారు. తెలంగాణ అవకాశాల ఖని అని, పరిశ్ర మల ఏర్పాటుకు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే అత్యంత అను కూల పరిస్థితులున్నాయని వివరించారు. ఇతర ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టే ముందు ఒక్కసారి తెలంగాణలో పర్యటించిన తర్వాత నిర్ణయం తీసుకోవాలని కోరారు. జైన సమాజం 'సేవా' స్ఫూర్తిని, తెలంగాణ ఇన్నోవేషన్ ఎకో సిస్టమ్ తో అనుసంధానిస్తే ప్రపంచం కోరుకుంటున్న నైతిక వృద్ధి నమూనా ఆవిష్కృతమవుతుందన్నారు. నిజమైన యూ నికార్న్ అంటే బిలియన్ డాలర్ల విలువ కాదని, లక్షలాది మంది జీవితాలను ప్రభావితం చేయడమని యువ పారిశ్రా మికవేత్తలు, ఆవిష్కర్తలకు సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ యోగా గురువు రాందేవ్ బాబా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, జీటో హైదరాబాద్ ఛాప్టర్ ప్రతినిధులు రోహిత్ కొఠారి, లలిత్ చోప్రా, విశాల్ అంచా లియా, బీఎల్ భండారీ, సుశీల్ తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డిని వదిలిపెట్ట

- వచ్చే అసెంబ్లీ ఓడించి తీరుతా
- రాహుల్, మోడీ ఆయనను కాపాడలేరు
- ప్రశాంత్ కిషోర్ మండిపాటు



**ఢిల్లీ, అక్టోబర్3:** జన్ సురాజ్ పార్టీ అధినేత, రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డిపై మరోసారి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "వచ్చే ఎన్నికల్లో తెలంగాణకు వెళ్లి రేవంత్‌ను ఓడించి తీరుతాను.. రాహుల్ గాంధీ, మోడీ ఎవరూ కాపాడలేరు" అని తాజాగా ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రకటించారు. బిహార్ ఎన్నికలు జరుగుతున్న సమయంలో తన జన్ సురాజ్ పార్టీని బలోపేతం చేసుకోవడానికి రేవంత్ రెడ్డిని ప్రశాంత్ కిషోర్ ఉపయోగించుకుంటున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. 2023 డిసెంబర్‌లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు పై విమర్శలు గుప్పించారు. కేసీఆర్ తన కేబినెట్‌లో బిహార్‌కు చెందిన అధికారులను ఎక్కువగా నియమించారని, వారిని అడ్డం పెట్టుకుని కుట్రలు చేస్తున్నారని..దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఆ సమయంలో ఓ టీవీ చానల్ తో మాట్లాడుతున్న సమయంలో "తెలంగాణ డీఎన్ఏ బిహార్ డీఎన్ఏ కంటే బెటర్.. బిహార్ వాళ్ల డీఎన్ఏలోనే కూలీ పని ఉంది" అని రేవంత్ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు బిహార్ ప్రజలను అవమానించినట్లుగా ఉన్నాయని బీజేపీ, ఆర్జేడీ, జేడీయూ వంటి పార్టీల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ప్రశాంత్ కిషోర్ సీరియస్ గా తీసుకున్నారు. "రేవంత్ బిహార్ ప్రజలను అవమానిస్తున్నాడు. బిహార్ వాళ్ల డీఎన్ఏ తక్కువ అంటే, మీరు మా సహాయం ఎందుకు అడిగారు?" అని ప్రశాంత్ కిషోర్ ప్రశ్నించారు. రేవంత్ తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఢిల్లీలో తనను మూడుసార్లు సంప్రదించి, ఎన్నికల వ్యూహాలకు సహాయం అడిగారని కూడా పీకే తెలిపారు. 2025 ఆగస్టులో బిహార్‌లో కాంగ్రెస్–ఆర్జేడీ కలిసి నిర్వహించిన 'ఓటర్ అధికార్ యాత్ర'లో రేవంత్ రెడ్డి పాల్గొనడం ప్రశాంత్ కిషోర్‌కు ఆగ్రహం తెప్పించింది. రాహుల్ గాంధీ, తేజస్వి యాదవ్ నేతృత్వంలో జరిగిన ఈ 16 రోజుల యాత్రలో రేవంత్ ప్రచారం చేయడం బిహార్ ప్రజల అవమానమని ప్రశాంత్ కిషోర్ అప్పుడే ఖండించారు. "రేవంత్ బిహార్ వాళ్లపై దుర్మార్గ వ్యాఖ్యలు చేస్తాడు. బిహార్ గ్రామాలకు వస్తే, ప్రజలు అతన్ని తరిమికొడతారు" అని హెచ్చరించారు. రాహుల్ గాంధీ రేవంత్‌ను ఆహ్వానించడం "బిహార్ గౌరవానికి అవమానం" అని కూడా విమర్శించారు. ప్రశాంత్ కిషోర్ 2025లో బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో జన్ సురాజ్ పార్టీతో పోటీ పడుతున్నారు. ఆత్మగౌరవ నినాదం ద్వారా బిహార్ ప్రజల్లో తమ పార్టీకి మద్దతు పెంచుకోవాలని, కాంగ్రెస్‌పై రేవంత్‌తో లింక్ చేసి విమర్శలు రేకెత్తించాలని వ్యూహమని భావిస్తున్నారు. ప్రశాంత్ కిషోర్ తనను టార్గెట్ చేస్తూ చేస్తున్న విమర్శలు, ఆరోపణలపై ఇప్పటి వరకూ రేవంత్ రెడ్డి స్పందించలేదు.

# కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆర్థిక విధ్వంసం

- జీఎస్టీ వసూళ్ల వృద్ధిలో దేశంలోనే అట్టడుగుకు పతనం
- రెండేళ్ల క్రితం దేశంలోనే నెం.1
- రేవంత్ అనుభవలేమి, అరాచకత్వమే కారణం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్



**హైదరాబాద్, అక్టోబర్ 3:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ సంపూర్ణ విధ్వంసానికి గురైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. తాజాగా, సెప్టెంబర్ 2025 నెలలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్ల వృద్ధి రేటులో తెలంగాణ దేశంలోనే అట్టడుగున ఉండటం దారుణమని కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఆర్థిక విధ్వంసానికి సంబంధించిన మరో స్పష్టమైన సూచిక ఇదేనని ఆయన పేర్కొన్నారు. సరిగ్గా రెండేళ్ల క్రితం, కేసీఆర్ గారి సమర్థ పాలనలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిచిందని ఆయన గుర్తు చేశారు. జీఎస్టీ వృద్ధిలో ఈ పతనం, రేవంత్ రెడ్డి పరిపాలనలో రాష్ట్ర ఆర్థికవ్యవస్థ ఎంత విధ్వంసం పాలయ్యిందో చెప్పే ఒక నిదర్శనమని కేటీఆర్ ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయం నుండి ఐటీ వరకూ అన్ని రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం గట్టి దన్ను ఇవ్వడంతో ఆర్థికవ్యవస్థ పరుగులు తీసి, రికార్డులు తిరగరాసిందని కేటీఆర్ తెలిపారు. కానీ, నేడు కాంగ్రెస్ పాలనలో, పండుగ వచ్చినా, పబ్బం వచ్చినా కూడా అన్ని రంగాలూ నేలచూపులే చూస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయం నుండి రియల్ ఎస్టేట్ వరకూ అన్ని రంగాల్లోనూ దైన్యమే తాండవిస్తోందని మండిపడ్డారు. "అరాచకత్వం, అవినీతి, అనుభవలేమి కలగలసిన రేవంత్ పాలనలో తెలంగాణ ఆర్థిక విధ్వంసానికి గురవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విధ్వంసాన్ని వెంటనే ఆపడానికి చర్యలు తీసుకోవాలి" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు.

# చరిత్ర తిరగరాస్తాం

- కాంగ్రెస్, బీఆర్ఎస్ ను ప్రజలే ఓడిస్తారు
- ఎప్పుడెప్పుడు ఎన్నికలు నిర్వహిస్తారా? అని ఎదురు చూస్తున్నా
- కాంగ్రెస్ కు లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహించాలనే సోయే లేదు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



**కరీంనగర్, అక్టోబర్3:** లోకల్‌బాడీ ఎన్నికల సర్వేలు బీజేపీకి అనుకూలంగా ఉన్నాయని, ఈసారి కరీంనగర్, సిరిసిల్ల జడ్పీ పీఠాలను బీజేపీ కైవసం చేసుకోబోతున్నదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం కరీంనగర్ లోని ఈఎన్ గార్డెన్స్ లో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మండలాధ్యక్షులు, జడ్పీటీసీ ప్రభారీల సమావేశం నిర్వహించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తోపాటు కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు గంగాడి సత్యనారాయణ, రెడ్డబోయిన గోపి, మాజీ అధ్యక్షులు బాస సత్యనారాయణ, మాజీ మేయర్లు సునీల్ రావు, డి.శంకర్, పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ రావు, కోమాల అంజనేయులు, వాసాల రమేశ్, రామ్ గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడారు. ఈ సమావేశానికి వచ్చిన వాళ్లకు అడ్వాన్స్ కంగ్రాచ్యులేషన్స్ చెబుతున్నా. లోకల్ బాడీ ఎన్నికల తరువాత ఇక్కడున్న వారిలో చాలా మంది ఎంపీటీసీలు, జడ్పీటీసీలుగా గెలవబోతున్నారు. ఈసారి కరీంనగర్, సిరిసిల్ల జిల్లా పరిషత్ ఛైర్మన్ పీఠాలను బీజేపీ కైవసం చేసుకోబోతోంది. సర్వే నివేదికలన్నీ ఇదే విషయం తేటతెల్లం చేస్తున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను ఎప్పుడెప్పుడు ఓడిద్దామా? అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. నేను సైతం ఎన్నికలు ఎప్పుడెప్పుడు జరుగుతాయా అని ఎదురు చూస్తున్నా. మిమ్ముల్ని ప్రజాప్రతినిధులుగా గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నా. పంచాయతీలకు నిధులిస్తోంది, అభివృద్ధి చేస్తోంది కూడా కేంద్ర నిధులతోనే. ప్రతి పల్లెలో ఉపాధి హామీ పనులు, ప్రధాని సడక్ యోజన, సీఐఆర్ఎఫ్ సహా అభివృద్ధి పనులన్నీ కేంద్ర నిధులతోనే జరుగుతున్నవి. కేంద్రం నిధులివ్వకపోతే ఎప్పుడో ఆత్మహత్య చేసుకునేవాళ్లని తాజామాజీ సర్పంచులు కూడా చెబుతున్నారు. ఇగ ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి పోలింగ్ బూత్ వద్దకు తీసుకొచ్చి ఓట్లేసే బాధ్యత తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను ఎప్పుడెప్పుడు ఓడిద్దామా? అని ప్రజలు ఎదురు చూస్తున్నారని, తాను సైతం ఎన్నికలు ఎప్పుడెప్పుడు జరుగుతాయా అని ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. తాజామాజీ సర్పంచులు, రైతులు, మహిళలు, వృద్ధులు, నిరుద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగులే ఈసారి కాంగ్రెస్ ను ఓడించబోతున్నారని, బీజేపీకి వాళ్లే బ్రాండ్ అంబాసిడర్లు కాబోతున్నారని చెప్పారు. కరీంనగర్ జిల్లా పరిషత్ పీఠంపై ఈసారి కాషాయ జెండాను ఎగరేయబోతున్నామని, నాయకులంతా సమన్వయంతో కలిసి పనిచేసి సిరిసిల్ల జిల్లా పరిషత్ ఛైర్మన్ పీఠాన్ని కూడా దక్కించుకుందామని, ఈసారి కొత్త చరిత్రను సృష్టిద్దామని పిలుపునిచ్చారు. అభ్యర్థులకు టిక్కెట్ల కేటాయింపు విషయాన్ని బీజేపీ రాష్ట్ర నాయకత్వం చూసుకుంటుందని, అందుకోసం ఇప్పటికే సర్వేలు చేయిస్తోందని తెలిపారు. సర్వే నివేదికలను బట్టి గెలుపే ప్రాతిపదికన టిక్కెట్లు వస్తాయని స్పష్టం చేశారు. టిక్కెట్ రాకపోయినా బాధపడొద్దని, వాళ్లకు పార్టీ పదవులుసహా ఇతరత్రా అన్ని రకాల సహాయం అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని భరోసా ఇచ్చారు. దయచేసి టిక్కెట్లు రాకపోయినా పార్టీ నిర్ణయించిన అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడి పనిచేయాలని, పొరపాటున ఎవరైనా పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తే కన్నతల్లికి ద్రోహం చేసినట్లేనని, వాళ్ల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

# అందరం కలసి ఉండాలన్నదే అలయ్ బలయ్

- కులమతాలతో విడదీసి పబ్బం గడుపుకోవాలనుకుంటే కుదరదు
- ఎక్కడో ఏదో జరిగిందని ..ఇక్కడా జరుగుతుందటే పొరపాటు
- భిన్నత్వంలో ఏకత్వం మన బలం అన్న వెంకయ్య
- దత్తాత్రేయ, బండారు విజయలక్ష్మిలకు అభినందన



**హైదరాబాద్, అక్టోబర్ 3:** వేషభాషలు వేరయినా అందరం భారతీయులమనే భావనతో కలిసి ముందుకెళ్తున్నామని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి ఆధ్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించిన 'అలయ్ బలయ్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖులను దత్తాత్రేయ సత్కరించారు. అనంతరం పలువురు ప్రముఖులు మాట్లాడారు. తొలుత వెంకయ్యనాయుడు మాట్లాడుతూ అందరం కలిసి ఉండాలనేది అలయ్ బలయ్ ఉద్దేశమన్నారు. 20 ఏళ్లుగా బండారు దత్తాత్రేయ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని కొనియాడారు. కొందరు కులం, మతం, వర్ణం, వర్గం, జాతి పేరుతో ప్రజల్ని చీల్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మన దేశంలో అలాంటి ఆశలు పెట్టుకున్నవారు నిరాశ చెందక తప్పదని చెప్పారు. చిన్నచిన్న విభేదాలు వచ్చినా భారతీయులం అనే భావనతో అందరూ కలిసి వెళుతారన్నారు. ఈ కార్యక్రమంతో ఐక్యతా సందేశాన్ని అందించడం ముదావహమని పేర్కొంటూ దత్తాత్రేయ, విజయలక్ష్మిలకు వెంకయ్యనాయుడు అభినందనలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలతో మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రజలకు తెలుస్తాయని సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. అందర్నీ ఒక్కచోట చేర్చి ఐక్యత తెచ్చేందుకు ఉపయోగపడుతుందన్నారు. సంప్రదాయాలకు అనుగుణంగా అలయ్ బలయ్ నిర్వహిస్తున్న దత్తాత్రేయ, విజయలక్ష్మిలకు ఆయన అభినందనలు తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ దత్తాత్రేయ అజాత శత్రువని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన్ను ప్రేమిస్తారని.. అందుకే పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున ఇక్కడికి వచ్చారని చెప్పారు. ప్రముఖ సినీనటుడు నాగార్జున మాట్లాడుతూ ఇలాంటి సత్కారం తనకు మొదటిసారి అని.. చాలా కొత్తగా ఉందని చెప్పారు. దత్తాత్రేయకు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. మనమంతా కలసి ఉన్నామని చెప్పడంతో పాటు ఒకరికి ఒకరమన్న ధైర్యం కల్పించిందన్నారు. 2005 నుంచి ఇప్పటి వరకు 20 ఏళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా జరుగుతున్న ఈ కార్యక్రమం తమకెంతో కాన్ఫిడెన్స్ ఇస్తుందన్నారు. దత్తాత్రేయతో తనకు ఎప్పటినుంచో పరిచయం ఉందని.. దీనికి ఆహ్వానించడం ఎంతో ఆనందంగా ఉందని నాగార్జున చెప్పారు. ప్రముఖ హాస్య నటుడు బ్రహ్మానందం మాట్లాడుతూ అలయ్ బలయ్ అంటే హృదయపూర్వకంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ప్రేమను పంచుకోవడమని చెప్పారు. శాంతి, ప్రేమ కరవైపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి పరస్పరం గౌరవించుకోవడం అవసరమన్నారు. శ్రీరాముడి కాలం నుంచి నేటి వరకు ఇది కొనసాగుతోందన్నారు.

# సోదరభావం పెంచే వేడుక అలయ్ బలయ్



ప్రశంసిస్తూ రాష్ట్రపతి ముర్ము ప్రకటన

**న్యూఢిల్లీ, అక్టోబర్3:** హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఏటా నిర్వహిస్తున్న అలయ్ బలయ్ కార్యక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము ప్రశంసించారు. సోదరభావాన్ని పెంపొందించే వేడుక 'అలయ్ బలయ్' అని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము అన్నారు. హైదరాబాద్‌లో నేడు ఈ పండుగ ఎంతో ఉత్సాహంగా నిర్వహించనున్నారని తెలిసి సంతోషించానని పేర్కొన్నారు. హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఏటా అలయ్ బలయ్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో తెలంగాణ ప్రజలకు అభినందనలు తెలుపుతూ రాష్ట్రపతి సందేశమిచ్చారు. తెలంగాణ ఆచారాలను పునరుజ్జీవింప జేయడానికి బండారు దత్తాత్రేయ అలయ్ బలయ్ పండుగను ప్రారంభించారు. ఇది సోదరభావాన్ని పెంపొందించే వార్షిక సాంస్కృతిక ఉత్సవం. అన్నివర్గాల ప్రజలను ఒక్కచోట చేర్చి తెలంగాణకు చెందిన గొప్ప సంస్కృతిని ప్రదర్శిస్తోంది. ప్రజల్లో ఐక్యత, సమాజ విలువలను వ్యాప్తి చేసేందుకు ఓ సామాజిక సమావేశంగా ఇది ఉపయోగపడుతోంది. అలయ్ బలయ్ వేడుకలు ఘనంగా జరగాలని కోరుకుంటున్నానని రాష్ట్రపతి పేర్కొన్నారు.



# మారుతున్న కాలనుగుణంగా కొత్త చట్టాలు

## కీలకం కానున్న రానున్న మూడేళ్లు

## కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్, అక్టోబర్ 3:** మారుతున్న సమాజానికి అనుగుణంగా చట్టాలు తీసుకుని వచ్చే ఆలోచనలో ప్రధాని మోడీ ఉన్నారని, పాతచట్టాలకు పాతరేయాల్సి ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇంకా బ్రిటిష్ కాలం నాటి చట్టాలు కొనసాగడం దురదృష్టకరమన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వచ్చే మూడేళ్లు చాలా కీలకమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రతి శాఖ అనేక సంస్కరణలు తీసుకువస్తోందని చెప్పుకొచ్చారు. కొత్త సమస్యలు వచ్చే అవకాశం ఉందని... వాటిని సమర్థవంతంగా ఎదుర్కొవాలని సూచించారు. బ్రిటిష్ చట్టాలు ఇప్పటికీ అమలు అవుతున్నాయని తెలిపారు. వర్తమాన ప్రజల ఆలోచనలకు అనుగుణంగా చట్టాలు తేవాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆలోచిస్తున్నారని చెప్పుకొచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ స్టేట్ ఆఫీస్‌లో ఆ పార్టీ స్టేట్ లీగల్ సెల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో బీజేపీ తెలంగాణ చీఫ్ రాంచందర్ రావు, ఎంపీలు కె.లక్ష్మణ్, రఘునందన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. అర్జున్ రామ్ మేఘవాల్ ఐఏఎస్‌గా ఉన్నప్పటికీ రాజీనామా చేసి కేంద్ర మంత్రి స్థాయికి ఎదిగారని ప్రశంసించారు. బీజేపీ శ్రేణులు కేంద్ర ప్రభుత్వ ఇమేజ్ పెంచే ప్రయత్నం చేయాలని దిశానిర్దేశం చేశారు. కేంద్రం పాలసీలకు అనుగుణంగా కోర్టుల్లో మనం వాదిస్తామనేది చాలా కీలకమని తెలిపారు. రానున్న మూడేళ్లు మోదీ ప్రభుత్వానికి చాలా కీలకమని ఉద్ఘాటించారు. అందుకు ప్రత్యేకమైన శిక్షణ తరగతులు నిర్వహించాలని మార్గనిర్దేశంచేశారు. కేంద్ర ప్రభుత్వ స్టాండ్ బలంగా వినిపించేందుకు ఎఫర్ట్ పెట్టాలని సూచించారు. తెలంగాణలో అధికారంలోకి బీజేపీ రావాలంటే అందరం కలసికట్టుగా పని చేయాలని కిషన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. కాలం చెల్లిన చట్టాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ రద్దు చేశారని బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ తెలిపారు. దేశాన్ని ఆర్థికంగా విచ్ఛిన్నం చేసేందుకు ఇతర దేశాలు కుట్రలు పన్నుతున్నాయని విమర్శించారు. ప్రధాని మోదీ విజనరీ లీడర్ కాబట్టి వేగంగా స్పందిస్తున్నారని చెప్పుకొచ్చారు. జీఎస్టీ తగ్గింపుతో దీపావళి వెలుగులను పేదల ఇళ్లల్లో మోదీ నింపుతున్నారని వివరించాచారు. అగ్రదేశాలు అడ్డగోలు టారిఫ్‌లతో భారతదేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేయాలని చూస్తున్నాయని ధ్వజమెత్తారు. ఇండియా ఎదుగుదలను చాలా దేశాలు జీర్ణించుకోలేక పోతున్నాయన్ని ÷ర్ అయ్యారు. స్వదేశీ వస్తువుల వినియోగించడం ద్వారా.. భారతదేశ ఆదాయం ఇతర దేశాలకు వెళ్లకుండా ఉంటుందని వెల్లడించారు. దీని ద్వారా పెట్టుబడులు పెరుగుతాయని... ఇతరులకు ఉపాధి కలుగుతోందని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం దక్కాలని గత చట్టాలను రద్దు చేసి.. భారత న్యాయ సంహిత చట్టాలను మోదీ సర్కార్ తెచ్చిందని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు తెలిపారు. హైదరాబాద్ నడి రోడ్డుపై గతంలో ఓ న్యాయవాది దంపతులను నరికి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసు వేసిన వాళ్లను వెనక్కి తీసుకోకపోతే హత్య చేశారని చెప్పుకొచ్చారు. ఈ కేసులో సీబీఐ దర్యాప్తు ప్రస్తుతం జరుగుతోందని వివరించారు. న్యాయవాదులకు భద్రత కల్పించే చట్టాలు దేశంలో రావాలని రాంచందర్ రావు ఆకాంక్షించారు.

# ఉమ్మడి కరీంనగర్ కాంగ్రెస్ నాయకులతో తుమ్మల మీటింగ్



**హైదరాబాద్, అక్టోబర్ 3:** కాంగ్రెస్ ఉమ్మడి కరీంనగర్‌ముఖ్య నాయకులతో శనివారం మినిస్టర్స్‌క్వార్టర్స్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భేటీ అయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వ్యవహరించాల్సిన తీరు ,అభ్యర్థుల ఎంపిక, అభ్యర్థులు విజయం సాధించడానికి తీసుకోవాల్సిన వ్యూహాలు, నియోజకవర్గ ఇన్‌చార్జి అభ్యర్థుల బాధ్యత తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు, సిరిసిల్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి, హుజూరాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఒడితల ప్రణవ్, నరేందర్ రెడ్డి ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# వాయుసేన సత్తా ఏమిటో చూపాం

## పాక్ మిగ్‌లను కూల్చేశాం: ఎయిర్ చీఫ్ మార్షల్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 3:** ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత వాయుసేన సత్తా ఎలాంటిదో ప్రపంచం చూసిందని వాయుసేన అధిపతి ఏపీ సింగ్ తెలిపారు. శత్రువుల స్థావరాలను గురిచూసి కచ్చితంగా కొట్టామని.. ఆ సమయంలో భారత్ శక్తిని ప్రపంచ దేశాలు చూశాయన్నారు. త్రివిధ దళాల సమన్వయంతో పాక్‌కు చెందిన పది ఫైటర్ జెట్ విమానాలను ధ్వంసం చేశామన్నారు. వాటిలో ఎఫ్-16, ఎఫ్ -17 యుద్ధ విమానాలు ఉన్నట్లు తెలిపారు. పాక్‌లోని దాదాపు 300 కి.మీ.ల లక్ష్యాలను ఛేదించినట్లు ఆ దేశాన్ని మోకాళ్లపై కూర్చొనేలా చేశామన్నారు. ఆపరేషన్ సమయంలో కేంద్రం సైన్యానికి పూర్తి స్వేచ్ఛనివ్వడంతో మన సైన్యం శత్రుదేశానికి చుక్కలు చూపించిందని పేర్కొన్నారు. ఇతర దేశాలతో ఘర్షణలు తలెత్తిన సమయాల్లో వాటిని ఎదుర్కోవాలి, పరిష్కరించుకోవాలనే విషయాలను భారత్ నుంచి నేర్చుకోవాలని ప్రపంచ దేశాలకు సూచించారు. భవిష్యత్తు సవాళ్లను అధిగమించేందుకు రక్షణరంగంలో స్వావలంభన కోసం 'సుదర్శన చక్ర'ను తయారుచేస్తున్నట్లు తెలిపారు. దీనికోసం ఇప్పటికే త్రివిధ దళాలు పనిని ప్రారంభించాయని తెలిపారు. ఇకపోతే మనం ఆపరేషన్ సిందూర్ తరవాత ఇప్పుడు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నామని అన్నారు. భవిష్యత్ సవాళ్లను ఎదుర్కనేందుకు కూడా సన్నద్ధంగా ఉన్నామన్నారు. మన అస్త్రశస్త్రాలు అన్నీ గేమ్ ఛేంజర్‌లేనని అన్నారు. స్వయంసహాయక శక్తితో భారత్ తిరుగులేని సామర్థ్యం సాధించిందని అన్నారు. మన ఆయుధ సంపత్తి తిరుగులేని దన్నారు.

04-10-25 Samayam_Layout 1 10/4/2025 4:41 AM Page 4



## సంపాదకీయం




# రాహుల్ అజ్ఞానానికి పరాకాష్ట!

విదేశాలకు వెళ్లడం.. అక్కడ భారత్ పాలకులపై దుమ్మెత్తి పోయడం,ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతోందని గగ్గోలు పెట్టడం కాంగ్రెస్ ఎంపి, విపక్షనేత రాహుల్ గాంధీకి బాగా అలవాటయిన కార్యక్రమం. విదేశీ గడ్డపై నుంచి దేశంపై దుమ్మెత్తి పోయడం అలవాటు చేసుకున్న నేతగా బహుళ ప్రచారం పొందు తున్నారు. విదేశీయతను పుణికి పుచ్చుకున్న అపరమేధావిగా నిరూపించుకుంటున్నారు. బిజెపిని విమర్శించినప్పుడల్లా ఆర్ఎస్ఎస్ భావజాలం అంటూ విమర్శలు చేస్తున్నారు. ఆర్ఎస్ఎస్ భావజాలం గురించి తెలిసి ఉంటే రాహుల్ ఇలా మాట్లాడరు. ఇకపోతే తమ పాలనలోనే భారతదేశం బాగా పరిఢ విల్లిందని, ఇతరుల అంటే బిజెపి పాలనలో దేశం సర్వనాశనం అవుతోందని, ఆర్ఎస్ఎస్, బిజెపిలు కలిసి దేశాన్ని నాశనం చేస్తున్నాయని ఆయన చేస్తున్న విమర్శలు అజ్ఞనానికి పరాకాష్టగా చూడాలి. నిజానికి ఈ దేశంలో రాహుల్‌కు ఉన్న అర్హత ఏమిటి. కేవలం రాజీవ్ గాంధీ తనయుడుగానే ఆయనకు స్థానం ఉంది. అంతకు మించిన రాజకీయ ప్రస్థానం ఆయనకు లేదు. వారసత్వ రాజకీయాల్లో పార్టీ అధ్యక్షుడిగా, ఎంపిగా వెలగబెడుతున్న రాహుల్ భారత్ ఔన్నత్యం, గొప్పతనం గురించి తెలియని అజ్ఞానిగా భావించాలి. అధికారం కల్ల అని తెలుసుకోవడం తో ఏదేదో మాట్లాడుతున్నారు. అడ్డగోలు విమర్శలు చేస్తున్నారు. బంగ్లాదశ్, నేపాల్ లాంటి ఆందోళనలు మనదేశంలోనూ రావాలని కోరుకుంటున్నారా అన్న అనుమానాలు కూడా కలుగుతున్నాయి. వసుదైక కుటుంబ, సర్వేజనా సుఖినో భవంతు అన్న ఆర్యోక్తి మన మట్టిలో పుట్టిన అత్యున్నత మానవాతా వాద విలువలకు అద్దంప ట్టేవి.. కానీ ఇవేవీ తెలియకుంటా ఏదోఒక చిన్న దేశానికి వెళ్లడం అక్కడ భారత్‌లో పాలన సరిగా లేదని, ఇక్కడ ప్రజాస్వామ్యం భ్రష్టు పట్టి పోతోందని గొంతు చించుకుంటున్నారు. ఈ దేశంలో ప్రజలు ఎంతో ఉన్నతంగా ఆలోచించి కాంగ్రెస్‌ను ఆదరించారు. అది ఎన్ని దేశద్రోహ పనులు చేసినా వెనకేసుకొచ్చారు. ఎమర్జెన్సీతో భారత ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది. అలాంటి పార్టీలో ఉంటూ ప్రజా స్వామ్యం గురించి, ఓట్ చోరీ గురించి గొంతు చించుకుంటున్నారు. అంతకు మించి ఆర్ఎస్ఎస్ గురించి అవాకులు చవాకులు పేలుతన్నారు. నిజానికి రాహుల్ భారతీయత కలిగిన నేత అయితే ఆర్ఎస్ఎస్ గరించి తెలుసుకుని ఉండేవారు. ఈదేశం కోసం, దేశ పటిష్టత కోసం, దేశం సర్వతో ముఖోన్నతి కోసం అహరహరం శ్రమిస్తున్న ఏకైక సంస్థ ఆర్ఎస్ఎస్. దాని గురించి తక్కువ మాట్లాడే వారు చరిత్ర హీనులు కాకతప్పదు. హిందూ సంస్కృతి నశిస్తే హిందూ సమాజమే ఉండదు. దేశ విభజన, పంజాబ్, బెంగాల్ ప్రాంతాల్లోని హింస, దోపిడీ, అత్యాచారాలను నిలువరించడం, వలస వచ్చిన శరణార్థు లకు శిబిరాల ఏర్పాటు, కరువు సమయం లో నిత్యావసర వస్తువులను అందించడం వంటి చర్యల ద్వారా సంఘ్ చరిత్ర పుటల్లో నిలిచిపోయింది. 1977 నాటి దివిసీమ ఉప్పెనకు బలైన 20వేల మంది మృతదేహాల ను, పశువుల కళేబరాలనూ ఖననం చేసిన ఘనత సంఘ కరసేవకులదే. 1975 నాటి ఎమర్జెన్సీ సమయం లో జైలుకు వెళ్లిన వారిలో అనేకులు స్వయం సేవకులు ఉన్నారు. అవివేకంతో కూడిన అభ్యాసం కంటే జ్ఞానం మేలు. జ్ఞానం కంటే ధ్యానం ఉత్తమం. ధ్యానం కంటే కర్మఫల త్యాగం మంచిది. ఆ త్యాగం వల్ల మనశ్శాంతి కలుగుతుంది.' అని భగవద్గీత శ్లోకం భావం. ప్రపంచవ్యాప్తంగా వివిధ ఆశయాలతో కూడిన అనేక సంస్థలు ఉన్నాయి. అయితే వందేళ్ల ప్రయాణం పూర్తి చేసుకున్న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ త్యాగాలకు సాటిరాగల మరో సంస్థ లేదనే చెప్పాలి. ఎందుకంటే ఆయా సంస్థలకు స్వలాభాపేక్ష ఉంది. కానీ ఆర్ఎస్ఎస్‌కు మాత్రం దేశ హితమే స్వార్థంగా ఉంది. వేల సంవత్సరాల భారతీయ సామాజిక విలువలే ఆలంబనగా, సామాజిక జీవనంలో ఏర్పడిన లోటుపాట్లను అధిగమిస్తూ, జీవన విధానంలో దృఢత్వం, సమాజం కోసం అంకితమైన వ్యక్తిత్వంతో ఓ విలక్షణమైన కార్యదీక్ష కలిగిన క్రమశిక్షణాయుత సమూహం ఆరెస్సెస్ సొంతం. అందుకే, కాలగమ నంలో అవరోధాలను, అణచివేతలను అధిగమిస్తూ... ప్రతికూల పరిస్థితుల్లో సైతం తన ప్రాబల్యాన్ని విస్తరిస్తూ, భారతీయ సంస్కృతిలోని సనాతన మూలాల నుంచి జాతీయవాద భావనతో ఆవిర్భవించి, మానవతా వాదాన్ని ఆవిష్కరిస్తోంది. దేశభక్తి అంటే జెండా ఎగరేయడం, దేశభక్తి గీతాలు పాడడం, ఐక్యత ప్రతిజ్ఞ చేయడం కాదని, ఈ స్ఫూర్తి మన ప్రవర్తనలో ప్రతిబింబించి, సమాజంలో పరివర్తనకు బీజాలు వేయాలన్నది ఆరెస్సెస్ లక్ష్యం. సమాజంలో అన్ని వర్గాల ప్రజలతో అరమరికలు లేకుండా కలిసి పనిచేసే అలవాట్లను ఆర్ఎసెస్ నేతలు ప్రేరేపించారు. ఈ స్ఫూర్తి కారణంగానే వందలాది సంఘ్ ప్రేరేపిత సంస్థలు భారతదేశమంతటా పనిచేస్తున్నా ఎక్కడా అవినీతి, బంధుప్రీతి ఆరోపణలు చెలరేగడం కనిపించదు. పైగా, వాటి పనితీరులో పారదర్శకత, జవాబుదారీతనం స్పష్టంగా కనిపిస్తుంది. కులం, వర్గం, మతం, ప్రాంతాలకు అతీతంగా ప్రజలు సమైక్యంగా ఉండాలని మాటలు చెప్పడం కాకుండా, ఆచరణలో ఆ విధంగా జీవించే వాతావరణం ఏర్పాటు చేయడంలో ఆరెస్సెస్‌ను మించిన మరో సంస్థ లేదని చెప్పవచ్చు. అందుకే రాజకీయాల పరిధిని మించి చూడలేని రాహుల్ లాంటి వారికి ఆరెస్సెస్ కార్యపద్ధతి అర్థం కాదు. దేశ ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని చూస్తేనే ఈ సంస్థ సిద్ధాంతం అవగతమవుతుంది. ఆవిర్భావం నుంచి రాజకీయ అధికారం కోసం కాకుండా 'వ్యక్తి నిర్మాణం' కేంద్రంగా, ప్రజలందరి శ్రేయస్సు కోసం ఆరెస్సెస్ పనిచేస్తోంది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు సహాయం చేయడానికి, సహాయ కార్యక్రమాలను నిర్వహించడానికి, పేద పిల్లలకు విద్య, వైద్య సదుపాయాలు అందించడానికి, వృద్ధులకు సేవ చేయడానికి స్వయం సేవక్‌లు అందించే సేవలలో వివక్ష మచ్చుకైనా కనిపించదు. ఇంతటి ఉదాత్త ఆశయంతో పనిచేస్తున్న ఆర్ఎస్ఎస్ పట్ల ఏహ్య భావంతో రాహుల్ నోరు పారేసుకుంటున్నారు. బిజెపితో కలిసి అని నిందిస్తున్నారు. ఇలాంటి నిందలతో అధికారంలోకి రావాలనుకోవడం కాంగ్రెస్‌కు అసాధ్యం అని తెలుసుకోవాలి.

# విదేశీ విద్యార్థులపై ట్రంప్ కొరడా

- పరిమిత సంఖ్యలోనే విద్యార్థులకు అడ్మిషన్లు
- యూనివర్సిటీలకు హుకూం జారీచేసిన వైట్‌హౌజ్



**వాషింగ్టన్, అక్టోబర్ 2:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరో హుకూం జారీచేశారు. విదేశీ విద్యార్థుల రాకపై ఆంక్షలు లాంటి కత్తి పెట్టారు. పరిమిత సంఖ్యలోనే వారిని అనుమతించాలని యూనివర్సిటీలను ఆదేశించారు. అమెరికా ప్రభుత్వ నిధులు కావాలంటే విదేశీ విద్యార్థుల అడ్మిషన్లను పరిమితం చేయాలని వైట్ హౌజ్ విశ్వవిద్యాలయాలకు తేల్చిచెప్పింది. ఈమేరకు ప్రతిపాదించిన నిబంధనలను మెమో రూపంలో దేశంలోని ప్రధాన యూనివర్శిటీలకు పంపింది. ప్రభుత్వ నిధులు కావాలంటే విదేశీ విద్యార్థుల సంఖ్యపై పరిమితి, జాతి, లింగ ఆధారిత నియామకాలు నిలిపివేయడం, విద్యార్థుల అడ్మిషన్ సమయంలో కచ్చితంగా ప్రామాణిక పరీక్ష నిర్వహించడం వంటివి చేపడితేనే ప్రభుత్వ నిధుల కేటాయింపులో ప్రాధాన్యం లభిస్తుందని వెల్లడించింది. ఈ నిబంధనలను అంగీకరించిన విశ్వవిద్యాలయాలు ప్రభుత్వం నుంచి వచ్చే లబ్ధిని పొందవచ్చని ఆ లేఖలో వెల్లడించారు. వీటిల్లో విద్యార్థులకు ప్రభుత్వ రుణాలు, గ్రాంట్లు, కాంట్రాక్టులు, రీసెర్చి నిధులు, విదేశీ స్కాలర్స్‌కు వీసా అనుమతులు, ట్యాక్స్ కోడ్‌లో ప్రాధాన్యం వంటివి పొందవచ్చని పేర్కొంది. అమెరికాలో ఉన్నతవిద్యను పునర్ వ్యవస్థీకరించి తమ భావజాలానికి అనుకూలంగా మార్చుకోవడానికి ట్రంప్ కార్యవర్గం చేస్తున్న మరో యత్నంగా దీనిని భావిస్తున్నారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయం ప్రభుత్వంతో 500 మిలియన్ డాలర్ల డీల్ చాలా దగ్గరగా ఉందని పేర్కొన్నారు. వైట్‌హౌస్ నుంచి లేఖలు అందుకొన్న వాటిలో అమెరికాలోని ఎంఐటీ సహా ప్రముఖ విశ్వవిద్యాలయాలు మొత్తం ఉన్నాయి. ఈ క్రమంలో విదేశీ వీసాలపై వచ్చే విద్యార్థుల సంఖ్య 15 శాతానికి మించి ఉండకూడదు. ఒకే దేశం నుంచి వచ్చిన విద్యార్థుల సంఖ్య 5 శాతానికి మించకూడదు. విదేశాల నుంచి అందే నిధుల వివరాలను బహిర్గతం చేయాలి. విద్యార్థుల అడ్మిషన్, ÷నాన్షియల్ ఎయిడ్ సమయంలో లింగ, జాతి, జాతీయత, రాజకీయ భావజాలం, జెండర్ ఐడెంటిటీ, లైంగిక ఆకర్షణ, మతపరమైన అంశాలు పరిగణనలోకి తీసుకోకూడదు. అండర్ గ్రాడ్యుయేట్ దరఖాస్తుదారులు కచ్చితంగా ప్రామాణిక పరీక్షను పూర్తిచేయాల్సిందే. విద్యా స్వేచ్ఛను కాపాడే విధానాలు అమలుచేయాలి. సంప్రదాయవాద ఆలోచన సరళిని ఇబ్బందిపెట్టే, దాడులకు పాల్పడే యూనిట్స్‌ను తొలగించడం వంటివి ఉన్నాయి. విద్యాలయాలను ఇబ్బందిపెట్టేలా రాజకీయ ప్రదర్శనలు, విద్యార్థులను లేదా గ్రూపులను వేధించకుండా చర్యలు చేపట్టాలి. ఉద్యోగులు అధికారిక విధుల సమయంలో రాజకీయ ప్రసంగాలు, చర్యలకు దూరంగా ఉండాలి. బాత్‌రూమ్‌లు, లాకర్ రూమ్‌లు లింగ ఆధారంగా వేర్వేరుగా ఉండాలి. హార్డ్‌సైన్స్ విద్యను అభ్యసించే విద్యార్థులకు ఉచిత ట్యూషన్ ఫీజ్, ప్రోత్సాహకం కింద 2 మిలియన్ డాలర్లు మించి ఇవ్వాలని ప్రతిపాదించారు. ఈ నిబంధనలు ఏమేరకు అమలుచేస్తున్నారనే అంశాన్ని జస్టిస్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్స్‌ను సమీక్షించి తెలుసుకొంటుంది. వీటిని ఉల్లంఘిస్తే ప్రభుత్వ లబ్ధిని రెండేళ్లపాటు ఆపేస్తారు.

# బ్రహ్మోస్‌ను మించి ధ్వని క్షిపణి

### తయారీకి డీఆర్‌డీఓ రంగం సిద్ధం





**న్యూఢిల్లీ, అక్టోబర్ 3:** బ్రహ్మోస్‌ను మించి ధ్వని క్షిపణి తయారీకి డీఆర్‌డీఓ రంగం సిద్ధం అవుతున్నట్లు సమాచారం. రక్షణ రంగంలో స్వయంసమృద్ధి సాధిస్తున్న భారత్.. మరింతగా అభివృద్ధిపై దృష్టి సారించింది. ఇటీవలి ఆపరేషన్ సిందూర్ తరవాత తమ దృష్టిని పెంచింది. స్వదేశీ అధునాతన ఆయుధాల ఉత్పత్తికి పెద్దపీట వేస్తోంది. అధునాతన క్షిపణి వ్యవస్థలు, ఫైటర్ జెట్లు, డ్రోన్ల ప్రాజెక్టులపై దృష్టి సారిస్తోంది. ఈ క్రమంలో హైపర్‌సోనిక్ క్షిపణి ప్రయోగాలను ముమ్మరం చేస్తోంది. ఇందులో భాగంగా హైపర్‌సోనిక్ గ్లైడ్ వెహికల్ 'ధ్వని' పరీక్షలను ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలని డీఆర్‌డీఓ ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్‌లో దడ పుట్టించిన బ్రహ్మోస్ కంటే ఈ క్షిపణులు భీకరంగా పనిచేస్తాయని అంచనా. అత్యంత వేగంగా ప్రయాణిస్తూ సుదూర లక్ష్యాలను నిమిషాల్లో ఛేదించగల సామర్థ్యం హెచ్‌జీవీల సొంతం. శబ్ద వేగానికి ఐదారు రెట్ల కంటే అధిక వేగంతో ఈ క్షిపణులు ప్రయాణించగలవు. డీఆర్‌డీఓ సిద్ధం చేస్తోన్న హెచ్‌జీవీ సుమారు గంటకు 7వేలకుపైగా కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లేలా రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. 1500 నుంచి 2వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించగలదని అంచనా. వేగంతో పాటు దిశను మార్చుకునే సామర్థ్యం ఉండడంతో శత్రుదేశాల గగనతల రక్షణ వ్యవస్థలకు స్పందించే సమయం కూడా ఇవ్వదని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. హైపర్‌సోనిక్ క్రూజ్ క్షిపణులకు భిన్నంగా ఈ నూతన గ్లైడ్ వెహికల్ ఉంటుంది. రాకెట్ సాయంతో అత్యంత ఎత్తుకు వెళ్లి.. అక్కడ నుంచి విడిపోయి హైపర్‌సోనిక్ వేగంతో లక్ష్యంవైపు దూసుకెళుతుంది. శత్రువుల గగనతల నిరోధక వ్యవస్థలకు చిక్కకుండా లక్ష్యాలను ఛేదించే సామర్థ్యమున్న ఈ హెచ్‌జీవీ పరీక్షలను డీఆర్‌డీఓ ముమ్మరం చేసింది. ఇప్పటికే ఎయిర్‌ఫ్రేమ్ ఏరోడైనమిక్స్, థర్మల్ మేనేజిమెంట్, స్క్రామ్‌జెట్ ఇంజిన్ పనితీరు, గైడెన్స్ వ్యవస్థకు సంబంధించి క్షేత్రస్థాయి, వైమానిక పరీక్షలు చేసింది. ఈ ఏడాది చివరి నాటికి 'ధ్వని' పూర్తి స్థాయి పరీక్షలు జరిపేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.



# పటిష్టంగా ఆర్థిక వ్యవస్థ

### ఎలాంటి ఒడిదుడుకులనైనా ఎదుర్కొనే సత్తా

### కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 3:** ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నిర్మాణాత్మక మార్పును చూస్తోందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. హఠాత్తుగా వచ్చిపడే షాక్‌లను స్వీకరిస్తున్న భారత సామర్థ్యం బలంగా ఉందన్నారు. ఎలాంటి ఒడిదుడుకులనైనా ఎదుర్కొనే సత్తా మనకు ఉందన్నారు. శుక్రవారం దిల్లీలో కౌటిల్య ఎకనామిక్ కాన్‌క్లేవ్ 2025లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్థిక, ఇంధన అసమతుల్యతను ఎదుర్కోవడం కూడా దేశాల ముందున్న కర్తవ్యం అని పేర్కొన్నారు. 'భౌగోళిక రాజకీయ సంఘర్షణలు తీవ్రమవుతున్నాయి. ఆంక్షలు, సుంకాలు, విభేదాలు ప్రపంచ సరఫరా గొలుసులను దెబ్బ తీస్తున్నాయి. ఇవి భారత్‌కు కూడా దెబ్బే. కానీ, వీటన్నింటినీ బలంగా ఎదుర్కొనే సామర్థ్యం మనకు ఉందని నిర్మల అన్నారు. మన ఆర్థిక పరపతి కూడా అభివృద్ధి చెందుతోంది. కొత్త సంకీర్ణాలు ఉద్భవిస్తున్నాయి. అయితే, మనం ఎదుర్కొంటున్నది తాత్కాలిక అంతరాయం మాత్రమే కాదు.. నిర్మాణాత్మక మార్పులు' అని ఆమె అన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ నిలకడగా ఉందని, స్థిరంగా వృద్ధి చెందుతూనే ఉందని నిర్మలా సీతారామన్ తెలిపారు. యాదృచ్ఛికంగా భారత్ ఈ స్థాయికి రాలేదని, అనేక శక్తిమంతమైన సంస్కరణల ద్వారా వచ్చిందన్నారు. ఇందుకు అనేక విధాలుగా కసరత్తు చేసిందన్నారు. భారత్ ఆర్థిక పురోగతి కారణంగానే గట్టిగా నిలబడగలుగుతోందన్నారు.

# కరూర్ తొక్కిసలాట ఘటన

### సిబిఐ విచారణకు తిరస్కరణ

### సిట్ విచారణకు హైకోర్టు ఆదేశం

**చెన్నై, అక్టోబర్ 3:** తమిళనాడులోని కరూర్‌లో తొక్కిసలాట జరిగి 41 మంది మృతి చెందిన విషయం సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ఈ తొక్కిసలాట ఘటనపై సీబీఐ విచారణ చేపట్టాలని మద్రాస్ హైకోర్టులో టీవీకే పిటిషన్ దాఖలు చేసింది. అయితే, ఈ పిటిషన్‌పై మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. విచారణ ప్రారంభ దశలోనే సీబీఐ దర్యాప్తు కోరడం సరికాదని కోర్టు వ్యాఖ్యానించింది. న్యాయస్థానాలను రాజకీయ వేదికలుగా మార్చకూడదని హెచ్చరించింది. ప్రభుత్వాలతో పాటు ప్రజలకూ అవగాహన, బాధ్యత ఉండాలని సూచించింది. ముఖ్యంగా ఇలాంటి పెద్ద సమావేశాలకు హాజరుకావడానికి ముందుగా ఆలోచించి, జాగ్రత్తలు తీసుకోవాలని కోర్టు స్పష్టం చేసింది. రూర్ ఘటనపై ఇప్పటికే విచారణ ప్రారంభమైందని, అవసరమైతే తదుపరి దశలో సరైన చర్యలు తీసుకోవచ్చని కోర్టు అభిప్రాయపడింది. ప్రజల ప్రాణాలకు భంగం కలిగించే సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు ముందస్తు చర్యలు తీసుకోవాలని కూడా హైకోర్టు ఆదేశించింది. అలాగే ఘటనపై సిట్ విచారణకు ఆదేశించింది.

# ఇక వెంటనే చెక్ క్లియరెన్స్

- ఆర్‌బీఐ సూచనలతో బ్యాంకుల అమలు
- నేటి నుంచే అమల్లోకి కొత్త విధానం

**ముంబై,అక్టోబర్ 3(ఆర్ఎన్ఎ):** చెక్కు వినియోగదారుకలు ఆర్‌బిఐ శుభవార్త చెప్పింది. సాంకేతికత అందుబాటులోకి వచ్చాక బ్యాంకింగ్ వ్యవస్థలో ఎన్నో మార్పులొచ్చాయి. ఈ క్రమంలో చెక్‌ల క్లీయరెన్స్‌ను కూడా గంటల్లో పరిష్కరించే వ్యవస్థ ఆందుబాటులోకి వచ్చింది. శనివారం నుంచి ఇక చెక్ క్లీయరెన్సులు వెంటలనే అమలవుతాయి. ఏదైనా చెక్కు క్లియర్ అవ్వాలంటే ప్రస్తుతం రెండ్రోజుల సమయం పడుతోంది. ఇకపై ఈ సమయం గణనీయంగా తగ్గనుంది. అక్టోబర్ 4 నుంచి కొన్ని గంటల్లోనే చెక్కు క్లియర్ కానుంది. ఆర్‌బీఐ ఆదేశాల మేరకు బ్యాంకులు శనివారం నుంచి దీన్ని అమలు చేయనున్నాయి. చెక్కులు క్లియర్ చేయడానికి అయ్యే సమయాన్ని గంటల వ్యవధిలోకి తగ్గించేందుకు ఆర్‌బీఐ కంటిన్యూస్ క్లియరింగ్ వ్యవస్థను తీసుకొచ్చింది. దీంతో చెక్కు సమర్పించిన గంటల వ్యవధిలోనే క్లియర్ అవుతుంది. ఈ విధానంలో వ్యాపార వేళల్లో చెక్కుల స్కానింగ్, సమర్పణ, క్లియరింగ్ అనేవి నిరంతరాయంగా సాగుతాయి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు చెక్కులు సమర్పించవచ్చు. సాయంత్రం 7 గంటల్లోపు క్లియర్ అవుతాయి. అంటే చెక్కు ఉదయం డిపాజిట్ చేస్తే అదే రోజు సాయంత్రానికల్లా నగదు మీ బ్యాంకు ఖాతాలో జమ అయిపోతుంది. సంబంధిత చెక్కును ఆమోదించడమో, తిరస్కరించడమో ఏదైనా సరే సాయంత్రం ఏడుకల్లా జరిగిపోవాలని బ్యాంకులను ఆర్‌బీఐ ఆదేశించింది. మొత్తం రెండు దశల్లో ఈ వ్యవస్థ అందుబాటులోకి రానుంది. ఫేజ్-1లో భాగంగా సాయంత్రం 7 గంటల్లోపు గడువు నిర్దేశిరచగా.. ఫేజ్-2లో కేవలం మూడు గంటల్లోనే చెక్కు క్లియర్ చేయాల్సి ఉంటుంది. 2026 జనవరి 3 నుంచి రెండో దశ ప్రారంభమవుతుంది. అంటే బ్యాంకు పనివేళల్లో ఎప్పుడు చెక్కు సమర్పించినా మూడు గంటల వ్యవధిలోనే బ్యాంకు ఖాతాలో నగదు జమవుతుంది. అంటే ఉదయం 10 గంటలకు చెక్కు సమర్పిస్తే మధ్యాహ్నం ఒంటిగంటకల్లా దాన్ని బ్యాంకులు క్లియర్ చేయాల్సి ఉంటుందన్నమాట. దీనికోసం మునుపటిలా రోజులతరబడి వేచి చూడాల్సిన అవసరం తప్పుతుంది.



04-10-25 Samayam_Layout 1 10/4/2025 4:41 AM Page 5



# ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం

మొదటి పేజీ తరువాయి

అమరావతికి భూసేకరణ విషయంలో కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ల్యాండ్ పూలింగ్ ద్వారా ఇవ్వని భూములను భూసేకరణ ద్వారా తీసుకునేందుకు ఆమోదం తెలిపింది. అమరావతిలో వివిధ పనుల వేగవంతానికి స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పీవీ) ఏర్పాటుకు ఆమోదముద్ర వేసింది. అమరావతి సహా రాష్ట్రవ్యాప్తంగా పలు సంస్థలకు భూకేటాయింపుల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. కుష్ఠు వ్యాధి పదం తొలగించేందుకు వీలుగా చట్టసవరణ చేయాలని నిర్ణయించింది. విద్యుత్ శాఖకు సంబంధించి పలు ప్రతిపాదనలకు, కార్మిక చట్టాల్లో పలు సవరణల ప్రతిపాదనలను మంత్రివర్గం ఆమోదించింది. అలాగే, రాజధాని నిర్మాణం లో మరో కీలక ముందడుగు పడింది.రాజధాని అమరావతి కోసం భూ సేకరణ కోసం ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏపీ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. భూములు ఇవ్వని కొందరు



రైతుల నుంచి భూసేకరణ చట్టం 2013 ద్వారా భూములు తీసుకోవాలని కేబినెట్. లో నిర్ణయం తీస్కున్నారు మేరకు ఏపీ క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అమరావతిలో పనుల కోసం ఎస్‌పీవీ ఏర్పాటుకు ఆమోదం లభించింది. పలు సంస్థలకు భూ కేటాయింపులు చేసేందుకు కేబినెట్ ఆమోదించింది. అలాగే, కార్మిక చట్టాల్లో పలు సవరణల ప్రతిపాదనలకు సైతం మంత్రి మండలి ఆమోదం లభించింది.

## ఎమ్మెల్యేలు ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడరాదు

**అమరావతి :** అసెంబ్లీలో కొందరు ఎమ్మెల్యేలు ఇష్టారీతిన మాట్లాడారు.. వారిని నియంత్రించాల్సిన బాధ్యత ఇన్‌ఛార్జి మంత్రులదేనని సీఎం చంద్రబాబు అన్నారు. ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జి మంత్రుల మధ్య సమన్వయం ఉండాలని సూచించారు. కేబినెట్ సమావేశం ముగిసిన తర్వాత పలు అంశాలపై మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చించారు. శాఖాపరంగా ఎలాంటి విమర్శలొచ్చినా గట్టిగా స్పందించాలి. చరిత్రలో తొలిసారి 93శాతం రిజర్వాయర్లు నింపాం. విజన్-2047లోని 10 సూత్రాల్లో ఇదో కీలక పరిణామం. పూర్వోదయ పథకం ద్వారా ఉద్యాన, ఆక్వా రంగాల్లో రాష్ట్రానికి రూ.65వేల కోట్లు వచ్చే అవకాశముంది. అన్ని ప్రాంతాల్లోనూ విజయవాడ ఉత్సవ్ తరహాలో ఈవెంట్లు పెట్టాలి. స్థానిక పండుగలను ప్రోత్సహించేలా నెలకో ఈవెంట్ పెట్టాలి. కడపలో జిందాల్ ఉక్కు పరిశ్రమను 2028లోపు పూర్తి చేస్తాం. ఈ నెల 16న ప్రధాని కర్నూలు పర్యటనను విజయవంతం చేయాలని సీఎం సూచించారు.అయితే, చామ్ విధానంలో పట్టణాభివృద్ధి చేపట్టిన నిర్మాణాలు ఇతర శాఖలు అందిపుచ్చుకోవాలని సీఎం చంద్రబాబు తెలిపారు. పూర్వోదయ పథకంలో ఏపీకి స్థానం లభించిన విషయాలు మంత్రులతో పంచుకున్నారు. ఏ పథకం ద్వారా దాదాపు రూ. 65 వేల కోట్లు ఉద్యాన, ఆక్వా రంగాలకు వచ్చే అవకాశం ఉంది. యానిమల్ హాస్టళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.. విజయవాడ ఉత్సవ్ తరహాలో నెలకో ఈవెంట్ రాష్ట్రంలో స్థానిక పండుగల్ని ప్రోత్సహించేలా అన్ని ప్రాంతాల్లో చేపట్టాలి అన్నారు. కర్నూల్ లో ఈ నెల 16వ తేదీన ప్రధాని మోడీ పర్యటన విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పుకొచ్చారు.

## అరకు కాఫీకి ఛేంజ్ మేకర్ అవార్డు



**అమరావతి :** జీఐ ట్యాగ్ పొందిన తర్వాత అరకు కాఫీ అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ బ్రాండ్‌గా మారిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. అరకు కాఫీకి ఛేంజ్ మేకర్ అవార్డుపై సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. సీఎంను కలిసి అవార్డు, ప్రశంసా పత్రంను మంత్రి సంధ్యారాణి, జీసీసీ ఎండీ అందజేశారు. అరకు కాఫీ ద్వారా జాతీయ స్థాయిలో బిజినెస్ లైన్ ఛేంజ్ మేకర్ అవార్డును గిరిజన సహకార సంస్థ దక్కించుకుంది. అరకు వ్యాలీ కాఫీకి ఫైనాన్షియల్ ట్రాన్స్‌ఫర్మేషన్ విభాగంలో అవార్డు దక్కడంపై గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, జీసీసీ ఎండీ కల్పన కుమారికి ముఖ్యమంత్రి ప్రశంసించారు.బిజినెస్ లైన్ నుంచి స్వీకరించిన అవార్డును, ప్రశంసా పత్రాన్ని పరిశీలించారు సీఎం. ఏజెన్సీ ప్రాంతంలో సేంద్రీయ విధానంలో సాగు అవుతున్న అరకు కాఫీ స్వచ్ఛత, సువానలతో పాటు ప్రత్యేక రుచిని కలిగి ఉందని చెప్పుకొచ్చారు. ఈ విశిష్టత కారణంగా అరకకు మంచి బ్రాండ్ అనే పేరు వచ్చిందని తెలిపారు. కాఫీ సాగు ద్వారా అరకులోని గిరిజనుల జీవన శైలిలో మార్పు వచ్చిందని వెల్లడించారు. ఇటీవల జీసీసీ-టాటా కన్స్యూమర్ ప్రొడెక్ట్స్ లిమిటెడ్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంతో దేశంలో తొలిసారిగా ఆర్గానిక్ సాల్యూబుల్ కాఫీ ఉత్పత్తి కానుందని వివరించారు. నర్సీపట్నం సమీపంలోని మాకవం-పాలెం గ్రామంలో ఆధునిక సాంకేతికతతో కూడిన ఇంటిగ్రేటెడ్ కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు అయ్యిందని తెలిపారు. తద్వారా విలువ ఆధారిత ఉత్పత్తిగా బీన్ టు కప్ మోడల్ అభివృద్ధి కానుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# అమరావతి నిర్మాణంలో కీలక ముందడుగు

మొదటి పేజీ తరువాయి

తెలిపారు. ప్రకాశం బ్యారేజ్- దివిసీమ ప్రాంతాల్లో వరదనష్టం నివారణ పనులు చేసేందుకు గత సంవత్సరమే ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని.. ఇందుకోసం రూ.107 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని గుర్తుచేశారు. ప్రకాశం బ్యారేజీ వద్ద, దివిసీమ వద్ద వీక్ అయిన బండ్స్‌ను రూ.4.49కోట్లతో పనులు చేయడానికి మంత్రిమండలి ఆమోదం తెలిపిందని అన్నారు. వైఎస్సార్ కడప జిల్లాలో మైలవరం రిజర్వాయర్‌ని 1981- 1982లో నిర్మాణం చేశారని తెలిపారు. 2021లో వచ్చిన భారీ వరదలను పట్టించుకోకపోవడంతో రూ.3కోట్లతో రిపేర్లు చేయించడానికి కేబినెట్ ఆమోదం తెలిపిందని చెప్పుకొచ్చారు. లక్షా 15 వేల ఎకరాలకు నీరు అందించడం, తిరుపతి, తిరుమలకు తాగునీరు అందించేందుకు 2017-2018లో టెండర్లని ఎన్‌సీసీకి ఇచ్చారని గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టును గత జగన్ ప్రభుత్వం మూలన పడేసిందని విమర్శించారు. తిరుపతిలో ప్రతి సంవత్సరం ఎ÷-లోటింగ్ పాపులేషన్ పెరుగుతూనే ఉందని తెలిపారు. ఈ అవసరాలను దృష్టిలో పెట్టుకుని అవసరమైన పనులు చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుందని మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. అనంతపురం- ఉరవకొండ వజ్రకరూరు కొత్త లిఫ్ట్ స్కీమ్‌కు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. దీని ద్వారా 10వేల 500 ఎకరాలకు సాగు, తాగునీరు వస్తుందని వివరించారు. ఈ పనులకు మంత్రి మండలి ఆమోదం తెలిపిందని చెప్పారు. ఏపీ టూరిజం పాలసీలో క్యారవాన్ టూరిజం, హోమ్‌స్టే ప్రోత్సాహకాలు చేర్చామని వెల్లడించారు. పెన్నా నదిపై మిడ్ పెన్నా రిజర్వాయర్‌ని 1962లో నిర్మించారని గుర్తుచేశారు. గత ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వంలో నిర్వాహణ చేయకపోవడంతో చాలా ఇబ్బందులు వచ్చాయని తెలిపారు. ఏపీలో స్త్రీ శక్తి పథకాన్ని 10 కోట్ల మంది మహిళలు వినియోగించుకున్నారని వివరించారు. ప్రతి జిల్లాలో రూ.15వేల చొప్పున ఆటోడ్రైవర్లకు 'ఆటోడ్రైవర్ల సేవలో'



పథకం అమలు చేస్తున్నామని ప్రకటించారు. ఈ పథకం ద్వారా 2,90,669 మందికి లబ్ధి చేకూరనుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక విధానం 2024- 2029కి క్యారవాన్ పార్కులు, క్యారవాన్లకి కేబినెట్ ఆమోదం తెలిపిందని అన్నారు. క్యారవాన్లు పెట్టేవారికి లైఫ్ ట్యాక్స్ , పార్కులు ఏర్పాటు చేసేవారికి స్టాంప్ డ్యూటీ మినహాయింపు ఇస్తున్నామని స్పష్టం చేశారు. బదిలీల్లో వందశాతం ఇన్సెంటివ్ ఉంటుందని వివరించారు. మొదటిగా వచ్చిన 25 క్యారవాన్లకు 100శాతం లైఫ్ ట్యాక్స్ మాఫీ ఉంటుందని... ఆ తర్వాత వచ్చే వాటికి ఇన్సెంటివ్‌లు ఉంటాయని తెలిపారు. హోంస్టేలకు సంబంధించి టూరిజం పాలసీని మంత్రి మండలి ఆమోదించిందని తెలిపారు. 1 నుంచి 6 రూములు హోంస్టేల కిందకు వస్తాయని.. అంతకు మించితే హోటల్‌గా పరిగణిస్తామని చెప్పుకొచ్చారు. ఈ హోంస్టేలలో ఓనర్లు కూడా అందులో నివాసం ఉండాలనే నిబంధన తప్పనిసరి చేశామని మంత్రి కొలుసు తెలిపారు. సీఆర్డీఏలో అమరావతి అభివృద్ధిలో భాగంగా ఎస్‌పీవీలు ఏర్పాటుకు ఆమోదం తెలిపాం. వీటికి గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు, రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ వంటివి టైమ్ టూ టైమ్ అందిస్తాం. ఏపీ సీఆర్డీఏ యాక్ట్ 2014లో 37,916 ఎకరాలను సేకరించాలని ప్రతిపాదించాం. అయితే 34,385 ఎకరాలు మాత్రమే తీసుకున్నాం. 3,500 ఎకరాల భూమిని రైతులు పూలింకి ఇవ్వలేదు. 2101.5 ఎకరాలు దీనిలో 191.62 ఎకరాల అక్విజేషన్‌కి అవార్డు పాస్ చేశాం. 369.23 ఎకరాలు పూలింగ్‌కి ఇస్తాం. 1,197 ఎకరాలను వైసీపీ విత్ డ్రా చేసుకుంది. ఇంకా 343 ఎకరాలు ల్యాండ్ అక్విజేషన్ నుంచి విత్ డ్రా చేసుకోవాల్సి ఉంది. ఎక్కడైనా రోడ్డు నిర్మాణానికి భూమి అడ్డు ఉంటే అక్కడ ల్యాండ్ అక్విజేషన్‌కి నోటిఫై చేసి తీసుకోవచ్చని నిర్ణయించాం. ఎస్వీయూకు గుంటూరులో కేటాయించిన భూమిని ఏపీ హైకోర్టు ఆదేశాల మేరకు రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నాం' అని మంత్రి పార్థసారథి స్పష్టం చేశారు. 'నేషనల్ కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి రూ.1000 కోట్లు అదనపు రుణంగా తీసుకునేందుకు, దాన్ని సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌కి బదలాయించడానికి నిర్ణయం తీసుకున్నాం. ఏపీ రిఫరెన్స్ స్టేషన్ నెట్‌వర్క్‌ని నేషనల్ నెట్‌వర్క్ స్టేషన్‌తో అనుసంధానించడానికి ఎంఓయూ చేసుకున్నాం. ఏపీ ట్రాన్స్ కో డిపార్టుమెంట్ ఉత్తర్వుల్లోని కొన్ని నిబంధనలు సవరించడా నికి ఇంధన శాఖ ప్రతిపాదనలకు ఆమోదించాం. జేఎస్‌డబ్ల్యూ న్యూ ఎనర్జీ జలదుర్గం వద్ద ఏర్పాటు చేసిన ఎలాంట్ ద్వారా వచ్చే విద్యుత్‌ని అక్కడ నిర్మించే స్టీల్‌ఎలాంట్‌కి వాడుకోవడానికి చేసిన ప్రతిపాదనను ఆమోదించాం. ఏపీని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా డెవలప్ చేయాలని నిర్ణయించాం. దీనికి ఒక సలహామండలి నిర్మాణానికి ఆమోదించాం. ఏపీ అసైన్ ల్యాండ్ 1977ని సవరణకు నిర్ణయం తీసుకున్నాం. ఆంధ్రప్రదేశ్ అసైన్‌ల్యాండ్‌ని కౌలుకు ఇచ్చేలా అవకాశం కల్పిస్తూ చేసిన ప్రతిపాదనకి మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది' అని మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు.

## ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు, వరద పరిస్థితులు

### కలెక్టర్లతో సమీక్షించిన సీఎం చంద్రబాబు

### నలుగురు మృతి..పరిహారం ప్రకటించిన బాబు

**అమరావతి :** ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు, వరద పరిస్థితులపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ తదితర జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రస్తుతం జిల్లాల్లో ఉన్న పరిస్థితులను సీఎం అడిగి తెలుసుకున్నారు. గొట్టా బ్యారేజీకి 1.89 లక్షల క్యూసెక్కులు, తోటపల్లికి 44 వేల క్యూసెక్కుల వరద వస్తోందని శ్రీకాకుళం కలెక్టర్ వివరించారు. ఒడిశాలోని వివిధ ప్రాంతాల్లో పడిన భారీ వర్షాల కారణంగా వంశధారకు 1.05 లక్షల క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. భారీ వర్షాలు, ప్రమాదాల కారణంగా నలుగురు మృతి చెందినట్లు అధికారులు సీఎం దృష్టికి తీసుకురాగా.. ఆయన విచారం వ్యక్తం చేశారు. విశాఖ నగరం కంచరపాలెంలో ఒకరు, శ్రీకాకుళం జిల్లా మందసలో ఇద్దరు, పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో ఒకరు మృతి చెందినట్లు తెలిపారు. బాధిత కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని అధికారులను సీఎం ఆదేశించారు. ప్రస్తుతం ఉత్తరాంధ్ర జిల్లాల్లో వర్షం లేదని, ఎగువ నుంచి వస్తున్న ప్రవాహాలతో నదుల్లో వరద ఉందన్నారు. భారీ వర్షాల కారణంగా కొన్ని చోట్ల చెట్లు కూలాయని, ఇప్పటికే 90 శాతం కూలిన చెట్లను తొలగించామని చెప్పారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో దాదాపు 90 శాతం మేర విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని ఈపీడీసీఎల్ అధికారులు వెల్లడించారు. ఇవాళ సాయంత్రం లోగా అన్ని ప్రాంతాల్లోనూ విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని సీఎం అధికారులను ఆదేశించారు.

## వాయుగుండ ప్రభావంతో వంశధరాకు భారీగా వరద

### మూడో ప్రమాద హెచ్చరిక జారీచేసినట్లు కలెక్టర్ వెల్లడి

**శ్రీకాకుళం :** తీవ్ర వాయుగుండం కారణంగా కురుస్తున్న వర్షాలతో వంశధార నదిలోకి వరదనీరు భారీగా చేరుతోంది. శ్రీకాకుళం జిల్లా హిరమండలంలోని గొట్టా బ్యారేజీ వద్ద వంశధార ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఒడిశాలోని అరబంగి, బడనాలా రిజర్వాయర్ల నుంచి నీరు విడుదల చేయడంతో నదిలోకి వరద భారీగా వస్తోంది. గొట్టా బ్యారేజీ నుంచి 1.04లక్షల క్యూసెక్కుల వరదనీరు దిగువకు ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. నదీపరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని అధికారులు తెలియజేయాలని ఆయన ఆదేశించారు. మరోవైపు జిల్లాలోని పాతపట్నం వద్ద మహేంద్రతనయ నదిలో నీటి ప్రవాహం పెరుగుతోంది. దీంతో పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ శివారు మహేంద్రనగర్ వీధిలోకి వరదనీరు చేరింది. పాతపట్నంలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. వంశధార నదిలో పెరిగిన వరద కారణంగా భామిని మండలం కీసరలో 300ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. బూర్జ మండలంలో నారాయణపురం, చిన్నలంకాం పరిధిలో చాలా చోట్ల పంటపొలాలు ముంపులో ఉన్నాయి.

## ఏపీలో ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల



**అమరావతి :** ఏపీలో ఇంటర్ పరీక్షలకు షెడ్యూల్ విడుదలైంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 23 నుంచి మార్చి 24వ తేదీ వరకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయని ఇంటర్ బోర్డు ఓ ప్రకటనలో వెల్లడించింది. ఫిబ్రవరి 23 నుంచి ప్రథమ సంవత్సరం, ఫిబ్రవరి 24 నుంచి ద్వితీయ ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతాయని పేర్కొంది. జనరల్ కోర్సులకు ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 1 నుంచి 10వ తేదీ వరకు; ఒకేషనల్ కోర్సులకు జనవరి 27 నుంచి ఫిబ్రవరి 10 వరకు రెండు సెషన్లలో ఉంటాయని తెలిపింది. ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటలవరకు (ఆదివారాల్లో సహా) రెండో సెషన్ ఉంటాయని తెలిపింది. అయితే, ఇది తాత్కాలిక షెడ్యూల్ మాత్రమేనని.. పండుగల్లో సెలవుల దృష్ట్యా అవసరమైతే ఈ షెడ్యూల్‌లో కొన్ని మార్పులు ఉండే అవకాశం ఉందని ఇంటర్ బోర్డు కార్యదర్శి డా.నారాయణ భరత్ గుప్తా తెలిపారు.

## మురకంబుట్ట రేప్ కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్

### రోడ్డుపై నడిపించుకుంటూ..కోర్టులో నిందితుల హాజరు

### రిమాండ్ విధిస్తూ కోర్టు ఆదేశం

**చిత్తూరు :** చిత్తూరు జిల్లాలో సంచలనం సృష్టించిన బాలిక గ్యాంగ్ రేప్ కేసులో జిల్లా పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ ఘటనకు పాల్పడిన ముగ్గురు నిందితులను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. అనంతరం వారిని అరెస్ట్ చేసి రహస్య ప్రాంతంలో విచారించారు. ఆ తర్వాత చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ మీడియా ఎదుట నిందితులను హాజరు పరిచి.. వివరాలను వెల్లడించారు. ఆ తర్వాత చిత్తూరు నగరంలోని నడి రోడ్డుపై నడిపించుకుంటూ నిందితులను కోర్టుకు పోలీసులు తరలించారు. ఈ సందర్భంగా స్థానికులు నిందితులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులకు కోర్టు రిమాండ్ విధించింది. సెప్టెంబర్ చివరి వారంలో చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలంలోని మురకంబుట్ట నగరవనం పార్కులో ఒంటరిగా ఉన్న ప్రేమ జంటపై ముగ్గురు యువకులు దాడి చేసి.. వారి వద్ద నుంచి నగదు దొంగలించారు. ఆ తర్వాత బాలికపై సామూహిక అత్యాచారం చేశారు. అనంతరం వారు పరారయ్యారు. దీంతో జరిగిన విషయాన్ని బాలిక.. తన తల్లిదండ్రులకు వివరించింది. వారు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మంగసముద్రంకు చెందిన హేమంత్, మురకంబుట్ట అగ్రహారానికి చెందిన కిశోర్, మహేశ్‌లు.. ఈ దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల కోసం పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఆ క్రమంలో శుక్రవారం నిందితులను పోలీసులు వేర్వేరు ప్రాంతాల్లో అరెస్ట్ చేశారు. నగరవనం పార్కుకు ఒంటరిగా వచ్చే మహిళలు, ప్రేమ జంటలు లక్ష్యంగా చేసుకుని ఈ ముగ్గురు నిందితులు బెదిరింపులకు పాల్పడే వారని పోలీసుల విచారణలో వెల్లడైంది. ప్రేమ జంటను తమ సెల్ ఫోన్లు ద్వారా చిత్రీకరించడం.. వాటిని కుటుంబ సభ్యులకు చూపిస్తా మంటూ బెదిరింపులకు పాల్పడే వారంటూ ఇప్పటికే వారిపై ఫిర్యాదులు అందాయి. ప్రేమ జంటల వద్ద నుంచి నగదు, నగలు దోచుకోవడంతోపాటు యువతులు, బాలికలపై అత్యాచారం జరిపే వారని పోలీసుల విచారణలో వెల్లడైంది. ఆ క్రమంలో వారి సెల్ ఫోన్లను సైతం పోలీసులు స్వాధీనం చేసుకుని.. వాటిలోని ఫోటోలు, వీడియోలను సైతం పరిశీలిస్తున్నారు. కాగా నిందితులపై ఫోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, దోపిడి, హత్యాయత్నం, కిడ్నాప్ కింద పలు కేసులను నిందితులపై పోలీసులు నమోదు చేశారు. మరోవైపు బాధితురాలిని పోలీసులు ఆసుపత్రికి తరలించారు. ఈ వైద్య పరీక్షల్లో బాలికపై అత్యాచారం జరిగినట్లు నిర్ధారణ అయినట్లు వైద్యుల నివేదిక స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

04-10-25 Samayam_Layout 1 10/4/2025 4:41 AM Page 6



## కుటుంబ సమేతంగా భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి.



**వరంగల్ అక్టోబర్ 3. (సమయం న్యూస్) :** విజయదశమి సందర్భంగా పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి వారి సతీమణి శ్రీమతి శ్రీ నాయిని నీలిమ రెడ్డిగారు, కుమార్తె అల్లుడు శ్రీమతి శ్రీ డాక్టర్ నాయిని శ్రీ గోధా విష్ణువర్ధన్ రెడ్డిగారు మొదటగా భద్రకాళి అమ్మవారిని ఆ తరువాత వేయిస్తంభాల ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను దర్శచించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు గౌరవ నాయిని రాజేందర్ రెడ్డి. నియోజకవర్గ ప్రజలంతా ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యలతో నిండునూరేళ్ళు వర్ధిల్లెలా దీవించాలని ఆ అమ్మవార్లను కోరుకున్నారు. ఈ సందర్భంలో ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డిగారితో పాటు వరంగల్ పార్లమెంటు సభ్యులు కడియం కావ్యగారు ఉన్నారు.

## దుబ్బాక ఎమ్మెల్యే ను కలిసిన నాయకులు




**రాయపోల్,అక్టోబర్3 :** దసరా పండుగ సందర్భంగా రాయపోల్ మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ని ఆయన నివాసం లో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి విజయ దశమి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మండల అద్యక్షులు వెంకటేశ్వర శర్మ,మాజీ zptc యాదగిరి,నాయకులు ఇప్ప దయాకర్, టెంకంపేట నర్సింలు తదితరులు ఉన్నారు.

## నేడు కొడంగల్ నియోజకవర్గం లో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి పర్యటన



**కొడంగల్,అక్టోబర్,03(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో వివిధ మండలాల్లో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ఈ క్రింది కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉ. 10గం. కొడంగల్ మండల కేంద్రంలో దసరా పండగ సందర్భంగా ముఖ్య నాయకుల, కార్యకర్తల జమ్మి పంచుకొని శుభాకాంక్షలు తెలియజేస్తారు. ఉ. 11 గం.కోస్గి మండల కేంద్రంలో లో బాలాజీ ఫంక్షన్ హాల్ లో కోస్గి మరియు గుండు మాల్ మండల ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు.కావున ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ,మాజీ ప్రజప్రతినిధులు, పాల్గొనాల్సిందిగా కోరుకుంటున్నాము.

## గజ్వేల్ లో త్వరలో అంత్యేష్టి ఏర్పాటు



### ఎన్ సీ సంతోష్

**సమయం న్యూస్ అక్టోబర్ 3 :** సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ సీ సంతోష్ గజ్వేల్ లో శుక్రవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో సొంత ఇల్లు, ఇంటి స్థలం లేని వారు దురదృష్టవశాత్తు ఎవరైనా చనిపోతే హిందు సంప్రదాయం ప్రకారం అంత్యక్రియల కార్యక్రమాలు జరుపుకోవడానికి ఇబ్బందిగా మారిన ప్రస్తుత తరుణంలో ఒక రెండు గదుల ఇల్లు అంత్యక్రియ కార్యక్రమాలు జరుపుకోవాడానికి ప్రతి వర్గానికి అందుబాటులో ఉండే విధంగా త్వరలో వైశ్య సంఘం సహకారంతో ఏర్పాటు చేసుకోవడం జరుగుతుంది అని అన్నారు స్థలం సేకరణ జరుగుతుందని త్వరలో భవనం నిర్మాణం

# గ్రామ పంచాయతీ సిబ్బంది వడ్డె కుమారస్వామి గారి కుటుంబాన్ని పరామర్శించిన రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి

**వరంగల్ అక్టోబర్ 3. (సమయం న్యూస్) :** పర్వతగిరి మండలం వడ్లకొండ గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ సిబ్బంది వాటర్ మాన్ & ఎలక్ట్రిషన్ వడ్డె కుమారస్వామి ఇటీవల మరణించగా ఈరోజు వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగడ సానుభూతి వ్యక్తం చేశారు అనంతరం వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పిన రాష్ట్ర మాజీ మంత్రి వర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గారితో మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వరరావు , జిల్లా మాజీ రైతు బంధు సభ్యులు చింతపట్ల సోమేశ్వరరావు , వడ్లకొండ మాజీ సర్పంచ్ అమడగని రాజు యాదవ్ , మండల నాయకులు రంగు కుమార్ గౌడ్, (ఫెర్టిలైజర్) చింతపట్ల సునీల్ రావు, ఇస్లావత్ హరీష్, సోషల్ మీడియా చిన్నపెల్లి అజయ్, వడ్లకొండ గ్రామ ముఖ్య నాయకులు పార్టీ కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు ఉన్నారు...



# రాయపోల్ లో ఘనంగా విజయదశమి వేడుకలు.





**రాయపోల్, అక్టోబర్3 :** రాయపోల్ మండలం లోని అన్ని గ్రామాలలో గురువారం విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం రాయపోల్ తో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రజలు నూతన వస్త్రాలను ధరించి,ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామాల్లోని ప్రజలు డప్పు చప్పుళ్ల మధ్య ఆలయాలు, కేటాయించిన ప్రదేశాలకు వెళ్లి జమ్మిచెట్టు వద్ద పండితులు వేదమంత్రోచ్చారణల మధ్య షమీ పూజ నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు జమ్మి ఆకు (బంగారం) పంపిణీ చేసుకుని విజయదశమి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. రాయపోల్ పోలీస్ స్టేషన్లో పోలీసులు ఆయుధ పూజ నిర్వహించారు. వివిధ గ్రామాల్లోని దుర్గామాత మండపాల వద్ద వాహనాల పూజలు చేసుకున్నారు.ముగిసిన నవరాత్రి ఉత్సవాలు

మండలంలోని కొత్తపల్లి,రామారం గ్రామాలలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిసాయి.తొమ్మిది రోజులపాటు పూజలందుకున్న అమ్మవారి విగ్రహాలను శోభాయాత్రగా తీసుకువెళ్ళి స్థానిక చెరువులలో భక్తి శ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఈ శోభాయాత్రలలో యువతుల,మహిళల సాంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామంలోని ప్రజలందరూ పాల్గొన్నారు.

# గ్రీన్‌ఫీల్డ్ హైవే సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయండి

**రాష్ట్ర అధ్యక్షుడు కి బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి వినతి.**



**ఖమ్మం,అక్టోబర్ 3:** (సమయం న్యూస్) ఖమ్మం నుండి దేవరపల్లి వెళుతున్న గ్రీన్ఫీల్డ్ హైవే విషయంలో రైతులు పడుతున్న సమస్యలను బిజెపి ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు నారపనేని రామచంద్ర దృష్టికి తీసుకువెళ్లారు. శుక్రవారం హైదరాబాదులోని పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఖమ్మం నుండి దేవరపల్లి వరకు నిర్మాణంలో ఉన్న గ్రీన్‌ఫీల్డ్ హైవే వలన రైతులు పడుతున్న ఇబ్బందులను ఈ సందర్భంగా వివరించారు.

సత్తుపల్లి ఎగ్జిట్ వరకు సాగుతున్న ఈ హైవే నిర్మాణం భూములను రెండు ముక్కలుగా విభజించిందని, పొలాలకు వెళ్లే దారులు లేక రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, ధాన్యం రవాణా వాహనాలకు దారి లేకపోవడంతో సాగు పనులు స్తంభించిపోతున్నాయని, చెరువులు–వాగులు–కాలువల క్రింద ఉన్న భూములకు చేరుకోవడమే కష్టసాధ్యమైందని నెల్లూరి వివరించారు. నాగార్జునసాగర్ కమాండ్ ఏరియాలో ఉన్న ఈ భూములు నీటిపారుదల ఆధారంగానే పంటలు పండిస్తాయని, కానీ సర్వీసు రోడ్లు లేకపోవడం వల్ల వ్యవసాయ కార్యకలాపాలు కొనసాగించడం కష్టమైందని చెప్పారు. హైవే కోసం రైతులు వ్యతిరేకం కాదని, కానీ వారి జీవనాధారాన్ని కాపాడే విధంగా వెంటనే ఇరువైపులా సర్వీసు రోడ్లను నిర్మించాల్సిన అవసరం ఉందని ఆయన రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకువెళ్లారు. సర్వీస్ రోడ్ నిర్మాణ విషయంలో జాతీయ నేతల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా వినతి పత్రాన్ని కేంద్ర రహదారులు, రవాణా , హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, బిజెపి జాతీయ నాయకులు, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు ఇంచార్జ్ పొంగులేటి సుధాకర్ రెడ్డి లకు వినతి పత్రం పంపినారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బిజెపి నాయకులు బండారు నరేష్, యార్లగడ్డ రాఘవ రావు తదితరులు ఉన్నారు.

# కృష్ణ బ్రిడ్జి చెక్పోస్ట్, కృష్ణ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ (ఐపీఎస్)

**నారాయణపేట: అక్టోబర్,03(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్. వినీత్ ఐపీఎస్ కృష్ణ బోర్డర్ చెక్పోస్ట్ ను శుక్రవారం అకస్మికంగా తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా బోర్డర్ చెక్పోస్ట్ ను పరిశీలించి ఇక్కడ జిల్లా పోలీసులతో 24౹7 పర్మినెంట్ చెక్ పోస్ట్ ఏర్పాటు చేయాలని నిరంతరం వాహనాల తనిఖీలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం కృష్ణ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, పోలీస్ స్టేషన్ ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ మ్యాప్ ను పరిశీలించి బోర్డర్లో ఉన్న గ్రామాలను జాతీయ రహదారి 167 పై రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న విధులు, కేసుల రికార్డులు, జనరల్ డైరీ, తనిఖీ చేసి సిబంధికి ప్రతిరోజు రోల్ కాల్ తీసుకోవాలని, పక్కగా విధులు నిర్వర్తించాలని, సిబ్బంది నిర్వహిస్తున్న విధుల గురించి అడిగి తెలుసుకొని, ప్రతి ఒక్కరు క్రమశిక్షణ సమయపాలన పాటించాలని




అందరు ప్రజలకు అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు. మండల పరిధిలో నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... జిల్లా సరిహద్దు వద్ద పెర్మనెంట్ చెక్పోస్ట్ ఏర్పాటు చేసి అక్రమ రవాణా, నిషేధిత పదార్థాలు, దొంగతనాలు, మానవ అక్రమ రవాణా వంటి కార్యకలాపాలను అరికట్టడం అత్యవసరమని, చెక్ పోస్ట్ వద్ద పోలీసు బలగాలు, సీసీ కెమెరాలు ఏర్పాటు వంటి సదుపాయాలు ఉండేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

పోలీస్ సిబ్బంది విధులు పకడ్బందీగా నిర్వర్తించాలని ప్రజల రక్షణలో ఎల్లప్పుడూ ముందుండాలని ఎస్పీ సూచించారు. డయల్ 100 కాల్స్ పట్ల వేగవంతైన స్పందన కలిగి ఉండాలని బాధితులకు సహాయం అందించాలని తెలిపారు. పోలీసులు క్రమశిక్షణతో పని చేస్తేనే ప్రజలలో పోలీస్ శాఖ పై విశ్వాసం పెరుగుతుందని గుర్తు చేశారు. సరిహద్దుల వద్ద అనుమానాస్పద వాహనాలు వ్యక్తులపై నిఘా ఉంచి అక్రమ వ్యాపారాలు అక్రమ రవాణా, దొంగతనాలు జరగకుండా నిరంతరం వాహనాల తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. ఈ తనిఖీల్లో మక్తల్ సీఐ రామ్ లాల్, ఎస్సై ఎస్.ఎం. నవీద్, పోలీసు సిబంది ఉన్నారు.

04-10-25 Samayam_Layout 1 10/4/2025 4:41 AM Page 7



# కొడంగల్ లో దసరా వేడుకల్లో పాల్గొన్నా ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి





**అనంతరం టిపిసిసి ప్రతినిధి, వక్ఫ్ బోర్డు సభ్యుడు ఎండి యూసుఫ్ ఇచ్చిన విందులో పాల్గొన్న ముఖ్యమంత్రి**

**కొడంగల్ మున్సిపాలిటీ,(మం)అక్టోబర్,03(సమయం న్యూస్)** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వికారాబాద్ జిల్లా కొడంగల్ లో దసరా వేడుకల్లో పాల్గొన్నారు. సొంత గ్రామం కొండారెడ్డిపల్లి లో దసరా ఉత్సవాల్లో పాల్గొన్న సీ ఎం గురువారం రాత్రి కొడంగల్ కు చేరుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డిని కలిసేందుకు కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున సీఎం నివాసానికి చేరుకున్నారు. శుక్రవారం ఉదయం పరిగి తాండూర్ ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి మనోహర్ రెడ్డిలతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి పార్టీ కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భం గా టిపిసిసి ప్రతినిధి, వక్ఫ్ బోర్డ్ సభ్యుడు ఎండి.యూసుఫ్ రేవంత్ రెడ్డిని విందుకు ఆహ్వానించారు. అక్కడ విందు ముగించుకున్న సీఎం రేవంత్ రెడ్డి హెలికాప్టర్ లో హైదరాబాద్ కు ప్రయాణమయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్ పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశార

# 'విలువలతో కూడిన వృద్ధి'కి కేరాఫ్ తెలంగాణ

- పారిశ్రామికాభివృద్ధికి అనుకూలం, అవకాశాల ఖని
- పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ఆహ్వానం
- 'జీటో కనెక్ట్ 2025' ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు




**హైదరాబాద్ అక్టోబర్03( సమయం న్యూస్).:** 'విలువలతో కూడిన వృద్ధి'కి కేరాఫ్ గా తెలంగాణ దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా మారిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. పారిశ్రామికాభివృద్ధికి అత్యంత అనుకూలంగా ఉన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను కోరారు. జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్(జీటో) హైదరాబాద్ ఛాప్టర్ ఆధ్వర్యంలో హైటెక్స్, హెచ్ఐసీసీలలో మూడ్రోజుల పాటు నిర్వహించనున్న 'జీటో కనెక్ట్ 2025'ను కేంద్ర మంత్రులు రాజ్ నాథ్ సింగ్, కిషన్ రెడ్డితో కలిసి శుక్రవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఒకప్పుడు పారిశ్రామికవేత్తలు ప్రభుత్వాలిచ్చే రాయితీలు, ప్రోత్సాహకాలను చూసే పెట్టుబడులు పెట్టేవారన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఇప్పుడు వారి ఆలోచన తీరు కూడా మారిందన్నారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటన్నారన్నారు. ముఖ్యంగా వృద్ధి నైతికమైనదా, సమ్మిళితమైనదా, సుస్థిరమైనదా..? అని అధ్యయనం చేసిన తర్వాతే అడుగు ముందుకేస్తున్నారన్నారు. భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా, భవిష్యత్తునే తెలంగాణ నిర్మిస్తోందన్నారు. తెలంగాణ అవకాశాల ఖని అని, పరిశ్రమల ఏర్పాటుకు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే అత్యంత అనుకూల పరిస్థితులున్నాయని వివరించారు. ఇతర ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టే ముందు ఒక్కసారి తెలంగాణలో పర్యటించిన తర్వాత నిర్ణయం తీసుకోవాలని కోరారు. జైన సమాజం 'సేవా' స్ఫూర్తిని, తెలంగాణ ఇన్నోవేషన్ ఎకో సిస్టమ్ తో అనుసంధానిస్తే ప్రపంచం కోరుకుంటున్న నైతిక వృద్ధి నమూనా ఆవిష్కృతమవుతుందన్నారు. నిజమైన యూనికార్న్ అంటే బిలియన్ డాలర్ల విలువ కాదని, లక్షలాది మంది జీవితాలను ప్రభావితం చేయడమని యువ పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలకు సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ యోగా గురువు రాందేవ్ బాబా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, జీటో హైదరాబాద్ ఛాప్టర్ ప్రతినిధులు రోహిత్ కొఠారి, లలిత్ చోప్రా, విశాల్ అంచాలియా, బీఎల్ భండారీ, సుశీల్ పాల్గొన్నారు.




# ఒడిశా నుండి తమిళ నాడు బొగ్గు సరఫరా కోసం ఒప్పందం

**చర్చలు 10 రోజుల్లో పూర్తి.**

**సింగరేణి సి ఎం డి బలరామ్.**



**హైదరాబాద్ అక్టోబర్03( సమయం న్యూస్).:** ఒడిశా నైనీ నుంచి తమిళనాడు జెన్ కో కు 2.88 మిలియన్ టన్నుల బొగ్గు సరఫరాసింగరేణి సీఎండీ శ్రీ ఎన్.బలరామ్ తో తమిళనాడు జెన్ కో ఎండీ శ్రీ ఎం.గోవిందరావు చర్చలు 10 రోజుల్లో పూర్తి కానున్న ఇంధన సరఫరా ఒప్పందం నైనీ బొగ్గు కు మొదటి వినియోగదారుగా తమిళనాడు సింగరేణి భవన్, అక్టోబరు 3, 2025సింగరేణి సంస్థ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఒడిశా లోని నైనీ బొగ్గు బ్లాక్ నుంచి తమిళనాడు పవర్ జనరేషన్ కార్పొరేషన్కు బొగ్గును సరఫరా చేసేందుకు సర్వం సిద్ధమైంది. ఈ బ్లాక్ నుంచి ఏటా 2.88 మిలియన్ టన్నుల బొగ్గు సరఫరాకు తమిళనాడు జెన్ కో తో సింగరేణి సంస్థ మరో 10 రోజుల్లో ఇంధన సరఫరా ఒప్పందం చేసుకోనుంది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ సింగరేణి భవన్ లో తమిళనాడు పవర్ జనరేషన్ కార్పొరేషన్ ఎండీ శ్రీ ఎం.గోవిందరావు. సింగరేణి సీఎండీ శ్రీ ఎన్.బలరామ్ ను కలిసి చర్చలు జరిపారు. తమిళనాడులోని తుత్తుకూడి జిల్లా ఉడింగిడిలో ఉన్న 1200 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ కోసం ప్రతీ ఏడాది 2.88 మిలియన్ టన్నుల జీ-11 బొగ్గు అవసరముందని తమిళనాడు జెన్ కో ఎండీ శ్రీ ఎం.గోవిందరావు పేర్కొన్నారు. సింగరేణి నుంచి ఈ బొగ్గును సరఫరా చేయాల్సిందిగా కోరారు. దీనిపై సింగరేణి సీఎండీ శ్రీ ఎన్.బలరామ్ స్పందిస్తూ... ఒడిశా లోని నైనీ బొగ్గు బ్లాక్ నుంచి ఉత్పత్తి ప్రారంభమైన నేపథ్యంలో రైలు, జల మార్గంలో సరఫరా చేసేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు బొగ్గు సరఫరాకు ఏర్పాట్లు చేయాల్సిందిగా నైనీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదే సమయంలో తమిళనాడు జెన్ కో తో మరో 10 రోజుల్లో ఇంధన సరఫరా ఒప్పందం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాల్సిందిగా బొగ్గు రవాణా, మార్కెటింగ్ శాఖ అధికారులకు స్పష్టం చేశారు. సింగరేణితో తమిళనాడు జెన్ కోకు ఉన్న దీర్ఘ కాలిక బంధాన్ని మరింత బలపరిచేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని ఈ సందర్భంగా సీఎండీ శ్రీ ఎన్.బలరామ్, తమిళనాడు జెన్ కో ఎండీ శ్రీ ఎం.గోవిందరావు పేర్కొన్నారు.ఇప్పటికే సింగరేణి ద్వారా తమిళనాడు లోని నార్త్ చెన్నై విద్యుత్ ప్లాంట్కు ప్రతీ ఏడాది 1.75 మిలియన్ టన్నుల బొగ్గు సరఫరా జరుగుతోంది. తాజాగా ఒడిశాలోని నైనీ ప్రాజెక్టు నుంచి ఏడాదికి 2.88 మిలియన్ టన్నుల బొగ్గు సరఫరాకు అంగీకారం కుదిరింది. ఈ నేపథ్యంలో నైనీ బొగ్గు కు మొదటి వినియోగదారుగా తమిళనాడు నిలవనుండటం విశేషం. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(కోల్ మూవ్మెంట్) శ్రీ బి.వెంకన్న, జీఎం( కో ఆర్డినేషన్, మార్కెటింగ్) శ్రీ టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సారె కావాలంటున్నారే తెలంగాణ పల్లెల్లల మళ్ళా కారే రావాలంటున్నారే తెలంగాణముఖరా కే గ్రామ ప్రజలు.



**ముఖరా కే అక్టోబర్03( సమయం న్యూస్).:** జిల్లాలల్ల,రాసుకోరా బిడ్డ ఇది కెసిఆర్ అడ్డా అంటూ దుర్గా దేవి నిమర్జనం శోభ యాత్ర లో కేసీఆర్ పాటలపై నృత్యాలు చేసిన ముఖరా కే మహిళలు....తెలంగాణ లో మళ్లి కేసీఆర్ పాలనే కావాలంటూ ముఖరా కే గ్రామం లో దుర్గ దేవి నిమర్జనం శోభ యాత్లో కేసీఆర్ కేటీఆర్ ఫోటోలు ప్రదర్శిస్తూ కేసీఆర్ పాటలకు నృత్యాలు చేసిన ముఖరా కే మహిళలు,మళ్ళీ కేసీఆర్ వస్తేనే తమ బ్రతుకులు మారుతాయని కేసీఆర్ వస్తేనే తమకు సంక్షేమ పథకాలు అందుతాయని, పెద్ద సారూ ఉంటేనే అన్ని బాగుంటాయాని,పెద్దసారూ పాలన లేక తమ బ్రతుకులు ఆగమయ్యాయి అని,మళ్ళీ తెలంగాణ బాగుపడాలంటే కేసీఆర్ సారే రావాలి అని "దేఖ్లెంగే" "గుర్తుల గుర్తించుకో రామక్క" "సారె రావాలంటున్నారే తెలంగాణ పల్లెల్లల మళ్ళా కారే కావాలంటున్నారే తెలంగాణ జిల్లాలల్ల" పాటలపై దుర్గా దేవి నిమర్జనం శోభ యాత్ర లో నృత్యాలు చేసిన ముఖరా కే మహిళలు,ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి, మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్, గ్రామ మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు

## అలయ్ బి బలాయ్ కార్యక్రమంలో పాల్గొన్న శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి.



**హైదరాబాద్ అక్టోబర్ 03( సమయం న్యూస్).:** మాజీ గవర్నర్ , బిజెపి పార్టీ సీనియర్ నేత బండారు దత్తాత్రేయ గారు దసరా పండుగ సందర్భంగా నిర్వహించిన అలయ్ - బలయి కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి గారు.

ఈ సందర్భంగా కమిటీ ఛైర్మన్ బండారు విజయలక్ష్మి గారు గుత్తా సుఖేందర్ రెడ్డి గారిని ఘనంగా సత్కరించారు. అనంతరం దత్తాత్రేయ గారిని శాలువతో గుత్తా సుఖేందర్ రెడ్డి గారు సన్మానించారు.

## జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటనలో పలు అభివృద్ధి పనుల పరిశీలన.

**వేగం పెంచి నిర్ణిత కాల వ్యాధిలో పూర్తిచేయాలని అధికారులకు ఆదేశాలు.**

**మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్**




**మెదక్ అక్టోబర్ 03( సమయం న్యూస్).:** మెదక్ నుండి ముక్త భూపతిపూర్ తాత్కాలిక బ్రిడ్జి రోడ్డు మరమ్మత్తు పనులు పూర్తి చేయాలిమహిళా శక్తి భవన నిర్మాణ పనులు వేగం పెంచాలి. తాత్కాలిక మరమత్తు పనులు, మహిళా శక్తి భవన నిర్మాణ పనుల పరిశీలనలో కలెక్టర్ వెల్లడి.మెదక్ నుండి ముక్త భూపతిపూర్ వెళ్లే తాత్కాలిక బ్రిడ్జి రోడ్డు నిర్మాణాన్ని మరియు మహిళా శక్తి భవనం నిర్మాణ పనులు శుక్రవారం కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.వర్షాలు వరదలు తాకిడికి గతంలో మెదక్ ముక్త భూపతిపూర్ బ్రిడ్జి భారీగా దెబ్బతిన్న దానిని తాత్కాలిక మరమ్మతులు చేపట్టడం జరిగిందని వాటిని పరిశీలించి పనులు తొందరగా పూర్తి చేయాలని ఆదేశించామని చెప్పారు. అలాగే మహిళా శక్తి భవనం నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఆదేశించామని వివరించారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులు ఎంత ఖర్చు పెట్టాలి.




**హైదరాబాద్ అక్టోబర్03( సమయం న్యూస్) :** జెడ్పిటిసి, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థుల ఖర్చు పరిమితిని ఎలక్షన్ కమిషన్ ప్రకటించింది. జెడ్పిటిసి అభ్యర్థి రూ 4 లక్షలు, ఎంపీటీసీ అభ్యర్థి రూ 1, 50 లక్షల వ్యయ పరిమితి ఉంది. అభ్యర్థులు పోటీ చేసే ప్రాంతంలో రాజకీయ పార్టీలు చేసే ఖర్చు కూడా అభ్యర్థి ఖాతాలోనే జమవుతుంది. సర్పంచ్ పదవికి పోటీ చేస్తున్న అభ్యర్థి 2011 జనాభా లెక్కల ప్రకారం 5వేల జనాభా కంటే ఎక్కువ ఉన్న గ్రామపంచాయతీకి రూ 2,50 లక్షలు, వార్డు సభ్య అభ్యర్థి రూ 50 వేలు, 5వేల జనాభా కంటే తక్కువ ఉన్న గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థి రూ 1,50 లక్షలు, వార్డు సభ్య అభ్యర్థి రూ 30 వేలు వ్యయం చేయడానికి పరిమితి ఉంది. జడ్పిటిసి, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేసిన అభ్యర్థులు 45 రోజుల్లో తమ ఎన్నికల ఖర్చుల తుది నివేదికలు సంబంధిత అధికారికి సమర్పించాలి. ఎన్నికల వ్యయ ఖర్చులు సమర్పించినట్లయితే గగెలిచిన పదవి కోల్పోవడంతో పాటు, పంచాయతీరాజ్ చట్టం ప్రకారం మూడేళ్లపాటు ఎన్నికల్లో పోటీకి అనార్హులవుతారు.

# ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు సబ్సిడీ.. గైడ్లైన్స్ ఇవే



దేశంలో రూ.2000 కోట్లతో 72,300 పబ్లిక్ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు కేంద్రం గైడ్లైన్స్ రిలీజ్ చేసింది. స్కీం కింద ప్రభుత్వ ఆఫీస్లలు, ఆస్పత్రులు, విద్యా సంస్థల్లో ఏర్పాటుకు 100%, రైల్వే స్టేషన్స్, ఎయిర్పోర్ట్స్, బస్ డిపోలు, టోల్ ప్లాజాలు, ఇతర పబ్లిక్ ప్రాంతాల్లో ఏర్పాటుకు 80% సబ్సిడీ ఇవ్వనుంది. ప్రభుత్వ ఏజెన్సీలు, పబ్లిక్ సెక్టార్ ఎంటర్ప్రైజెస్ ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపింది.

# నర్సంపేట ఘటనపై విచారణ కొనసాగుతోంది




**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

నర్సంపేటలో గాంధీ జయంతి వేళ సమక్షంలో జంతు బలి ఘటనపై వరంగల్ పోలీస్ కమిషనర్ స్పందించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ తెలిపారు. కాగా గురువారం సాయంత్రం వెంకటేశ్వరస్వామి గుడి దగ్గర ఈ కార్యక్రమం జరుగగా.. పోలీసులు బందోబస్తు కోసం వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగింది



శుక్రవారం హైదరాబాద్ పర్యటనకు విచ్చేసిన కేంద్ర రక్షణ శాఖ మంత్రి వర్యులు రాజ్ నాథ్ సింగ్ గారికి బేగంపేట విమానాశ్రయంలో పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

# ఫలక్ నుమా ఆర్వోబీని ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్

- ఎస్ ఆర్ డి పి ద్వారా 38 పనులు అందుబాటు లోకి వచ్చాయి.
- మొత్తం 42 పనులకు రూ.5937 కోట్ల రూపాయల తో చేపట్టిన పనులు



**హైదరాబాద్, అక్టోబర్ 3,( సమయం న్యూస్) :** జీహెచ్ఎంసీ నిధులు రూ 52.03 కోట్ల వ్యయంతో నిర్మించిన సికింద్రాబాద్ - ఫలక్నుమా బ్రాడ్గేజ్ లైన్లోని ఫలక్నుమా వద్ద ఆర్ఓబీకి సమాంతర ఆర్ఓబీనీ శుక్రవారం హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తో కలిసి ప్రారంభించారు.

కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసుదుద్దీన్ ఒవైసీ , ఎమ్మెల్సీలు మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండీ, మీర్జా రహమత్ బేగ్ , ఎమ్మెల్యేలుమహమ్మద్ ముబీన్, మీర్ జల్ఫికర్ అలీ ,జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, చార్మినార్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్లు,తదితరులు పాల్గొన్నారు.

**ఆర్వోబీ ప్రారంభంతో...**
**ఫలక్ నుమాలో తీరనున్న ట్రాఫిక్ కష్టాలు**

పాతబస్తీ ఫలక్ నామాలో నేటి నుంచి ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. సికింద్రాబాద్ నుంచి ఫలక్ నామా బ్రాడ్ గేజ్ లైన్ వద్ద ఉన్న ఆర్వోబీకి సమాంతరంగా జీహెచ్ఎంసీ ఆర్వోబీ నీ నిర్మించింది.

రూ.52. కోట్లతో 4 వరుసల్లో ఆర్వోబీని జీహెచ్ఎంసీ నిర్మించింది. పాత ఆర్వోబీని పునరుద్ధరించడంతో పాటు దానికి సమాతరంగా మరో ఆర్వోబీని నిర్మించడంతో బార్కస్ జంక్షన్ నుంచి ఫలక్ నామా బస్ డిపో, రైల్వే స్టేషన్, చార్మినార్ వైపు వెళ్లే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తొలగనున్నాయి. సమయం ఆదాతోపాటు గంటల తరబడి నిలిచిపోయే ట్రాఫిక్ నుంచి ఊరట లభించనుంది.ఫలక్నుమా ఆర్ఓబీనీ ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.నగరంలో ఎస్ ఆర్ డి పి ద్వారా చేపట్టిన పనులు సత్ఫలితాలుగత ప్రభుత్వంలో 5937 కోట్ల రూపాయల అంచనాతో 42 పనులకు ప్రతిపాదించారు ఇప్పటివరకు 39 పనులు అందుబాటులోకి రావడం జరిగింది.మిగతా మూడు పనులు పూర్తి కావడానికి మరో సంవత్సరం లో పూర్తి చేయనున్నారు.నల్గొండ ఎక్స్ రోడ్డు నుండి ఒవైసీ హాస్పిటల్ వరకు శాస్త్రి పురం రైల్వే ఓవర్ బ్రిడ్జి, ఉప్పల్ ఫ్లై ఓవర్ అసంపూర్తిగా ఉన్నాయి. అట్టి పనులు పూర్తయ్యితే ఎస్ ఆర్ డి పి పనులు పూర్తి అవుతాయి.




లిహెచ్ సిటీ ద్వారా చేపట్టనున్న మొత్తం పనులు గత ప్రభుత్వంలో ఎస్ ఆర్ డి పి ద్వారా రెండోదశ ప్రతిపాదనల పనులను తీసుకున్నారు ప్రజా పాలన ప్రభుత్వంలో దానికి కొత్త పేరు హెచ్ సిటీ పథకం రూపకల్పన చేసే అట్టహాసంగా ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా అన్ని పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసి యేడాది కావస్తున్న ఒకే ఒక పని ప్రారంభం అయ్యింది. అది కూడా జాతీయ రహదాని నుండి అమీన్ పూర్ వరకు గత నెల రాష్ట్ర మంత్రి డి శ్రీధర్ బాబు శ్రీకారం చుట్టిన మిగతా పనులు ఒక్కటి కూడా మొదలు పెట్టలేదు..గత ప్రభుత్వంలో చేపట్టిన ఫ్లై ఓవర్లు, అండర్ పాసులు ఆర్ ఓ బి లా వాహన రద్దీ తగ్గించడం రోడ్డు రవాణా మెరుగు పడింది అందుకు తగ్గట్టు వాహన వేగం పెరిగి వాహన దారులకు ఇబ్బందులు తగ్గిందని చెప్పక తప్పదు..

# డబుల్ బెడ్ రూం ఇళ్లను పంపిణీ చేసిన హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్.

**హైదరాబాద్ అక్టోబర్ 03( సమయం న్యూస్). :** గతంలో డబుల్ బెడ్ రూం కేటాయించి కోర్టు కేసులో ఆగిపోయి కోర్టు నుండి క్లియరెన్స్ వచ్చినచార్మినార్ ,మలక్ పేట , యాకత్ పుర , చాంద్రాయణ గుట్ట నియోజకవర్గాలకు సంబంధించిన లబ్ధిదారులకు మినిస్టర్ క్వార్టర్స్ లో డబుల్ బెడ్ రూం పట్టాలు పంపిణీ చేసిన హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయ లక్ష్మి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్,ఎమ్మెల్యేలు ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.. ప్రాంత నివాసితులకు 2 ఇళ్ల కేటాయింపు పథకంలో భాగంగా, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం మంకల్ గ్రామంలో 2 ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టింది. కలెక్టర్, రంగారెడ్డి హైదరాబాద్ జిల్లాకు చెందిన 1730 మంది లబ్ధిదారుల జాబితాను ప్రచురించారు మరియు మంకల్-ఫేజ్-స్థానంలో 2 ఇళ్లను కేటాయించారు.అందులో భాగంగా చార్మినార్ ,మలక్ పేట ,యాకత్ పుర ,చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో ఉన్న లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు అంబర్ పేట - 134,బహుదూర్ పుర - 294,బండ్లగూడ - 155,చార్మినార్ - 209 సైదాబాద్ - 206 ,ఇతర ప్రాంతాల్లో ఉన్న 28 డబుల్ బెడ్ రూంలలో మొత్తం 1024 మంది లబ్ధిదారుల్లో ఈరోజు మంత్రి పొన్నం ప్రభాకర్ గారి చేతుల మీదుగా 75 మంది పట్టాలు అందుకున్నారు.. మిగిలిన లబ్ధిదారులకు స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో పట్టాలు పంపిణీ చేయనున్నారు.



# మినిస్టర్ క్వార్టర్స్ లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన జిల్లా కాంగ్రెస్ ముఖ్య నేతల సమావేశం..

**హైదరాబాద్ అక్టోబర్03( సమయం న్యూస్).:** సమావేశ ంలో పాల్గొన్న మంత్రులు పొన్నం ప్రభాకర్,శ్రీధర్ బాబు , అడ్లూరి లక్ష్మణ్ కుమార్,ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ,ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్య నారాయణ, మేడిపల్లి సత్యం,మాజీ మంత్రి జీవన్ రెడ్డి, కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు, సిరిసిల్ల కాంగ్రెస్ ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి, హుజూరాబాద్ కాంగ్రెస్ ఇంచార్జి ఒడితల ప్రణవ్, నరేందర్ రెడ్డి ఇతర ముఖ్య నేతలు..స్థానిక సంస్థల ఎన్నికల్లో వ్యవహరించాల్సిన తీరు ,అభ్యర్థుల ఎంపిక, అభ్యర్థులు విజయం సాధించడానికి తీసుకోవాల్సిన వ్యూహాలు , నియోజకవర్గ ఇంచార్జి అభ్యర్థుల బాధ్యత తదితర అంశాలపై చర్చ..



# కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆర్థిక విధ్వంసం: కేటీఆర్

- జీఎస్టీ వసూళ్ల వృద్ధిలో దేశంలోనే అట్టడుగుకు పతనం
- సరిగ్గా రెండేళ్ల క్రితం, కేసీఆర్ గారి సమర్థ పాలనలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిచిందన్న కేటీఆర్
- రేవంత్ రెడ్డి అనుభవలేమి, అరాచకత్వమే కారణం:
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ధ్వజం
- వ్యవసాయం నుండి రియల్ ఎస్టేట్ వరకూ అన్ని రంగాల్లోనూ పతనం



**హైదరాబాద్ అక్టోబర్03( సమయం న్యూస్).:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ సంపూర్ణ విధ్వంసానికి గురైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. తాజాగా, సెప్టెంబర్ 2025 నెలలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్ల వృద్ధి రేటులో తెలంగాణ దేశంలోనే అట్టడుగున ఉండటం దారుణమని కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఆర్థిక విధ్వంసానికి సంబంధించిన మరో స్పష్టమైన సూచిక ఇదేనని ఆయన పేర్కొన్నారు. సరిగ్గా రెండేళ్ల క్రితం, కేసీఆర్ గారి సమర్థ పాలనలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిచిందని ఆయన గుర్తు చేశారు. జీఎస్టీ వృద్ధిలో ఈ పతనం, రేవంత్ రెడ్డి పరిపాలనలో రాష్ట్ర ఆర్థికవ్యవస్థ ఎంత విధ్వంసం పాలయ్యిందో చెప్పే ఒక నిదర్శనమని కేటీఆర్ ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయం నుండి ఐటీ వరకూ అన్ని రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం గట్టి దన్ను ఇవ్వడంతో ఆర్థికవ్యవస్థ పరుగులు తీసి, రికార్డులు తిరగరాసిందని కేటీఆర్ తెలిపారు. కానీ, నేడు కాంగ్రెస్ పాలనలో, పండుగ వచ్చినా, పబ్బం వచ్చినా కూడా అన్ని రంగాలూ నేలచూపులే చూస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయం నుండి రియల్ ఎస్టేట్ వరకూ అన్ని రంగాల్లోనూ దైన్యమే తాండవిస్తోందని మండిపడ్డారు.

"అరాచకత్వం, అవినీతి, అనుభవలేమి కలగలసిన రేవంత్ పాలనలో తెలంగాణ ఆర్థిక విధ్వంసానికి గురవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విధ్వంసాన్ని వెంటనే ఆపడానికి చర్యలు తీసుకోవాలి" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు.

# వేయి స్తంభాల ఆలయం దుర్గామాత శోభయాత్రలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కుటుంబం






**వరంగల్ అక్టోబర్ 3. (సమయం న్యూస్):** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని వేయిస్తంభాల దేవాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజున దుర్గామాత శోభయాత్రను ఘనంగా నిర్వహించారు. అంగరంగ వైభవంగ జరిగిన ఈ శోభయాత్రలో పశ్చిమ నియోజక వర్గం శాసనసభ్యులు గౌరవనీయులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. దుర్గామాత శోభయాత్ర నిర్వహించేముందు ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి , వారి సతీమణి శ్రీమతి శ్రీ నాయిని నీలిమ రెడ్డిగారు, కుమార్తె అల్లుడు శ్రీమతి శ్రీ డాక్టర్ శ్రీ గోదా విష్ణు వర్ధన్ రెడ్డి, దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి శోభాయాత్రను ప్రారంభించారు. వేయి స్తంభాల ఆలయం నుండి పద్మాక్షమ్మ గుట్ట వరకు ఘనంగ సాగిన ఈ శోభయాత్రలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మరియు వారి కుటుంబ సభ్యులతోపాటు కుడా చైర్మెన్ శ్రీ ఇనుగాల వెంకట్రాంరెడ్డి గారు,మరియు పశ్చిమ నియోజకవర్గం లోని ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, డివిజన్ల ప్రెసిడెంట్లు, మాజి కార్పోరేటర్లు,బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, మైనారిటీ నాయకులు, యూత్ నాయకులు కార్యకర్తలు, ఆలయ అర్చకులు, నియోజకవర్గ ప్రజలు, భక్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



# 'ముసలి' రోగాలు 'యవ్వనం'లోకి!

ఫిరోజ్ ఖాన్, సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ (9640466464)

ఒకప్పుడు రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్) అంటే 50, 60 ఏళ్లు దాటిన వృద్ధాప్యపు హద్దుల్లో సంక్రమించే వ్యాధులుగా భావించేవారు. కానీ కాలం మారింది. ఈ 'ముసలి రోగాలు' ఇప్పుడు ఏకంగా యవ్వనంపైనే దాడి చేస్తున్నాయి. 30 ఏళ్ల లోపు యువతలోనూ బీపీ, షుగర్ కేసులు ఆందోళనకరంగా పెరుగుతున్నాయి. ఆధునిక జీవనశైలి పేరుతో అలవాటు చేసుకుంటున్న శారీరక శ్రమ లేమి, ఫాస్ట్‌ఫుడ్ వ్యసనం, విపరీతమైన మానసిక ఒత్తిడి - ఇవే ఈ అసాంక్రమిక వ్యాధుల (NCDs)కు ప్రధాన హేతువులుగా వైద్య నిపుణులు ఘోషిస్తున్నారు.

## ఎన్‌సీడీ సర్వేలో భయంకర వాస్తవం

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నిర్వహించిన ఎన్‌సీడీ సర్వేలో బయటపడిన గణాంకాలు నిజంగానే వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 22 కేంద్రాలు ఉండగా పట్టణం లో 5 ఆరోగ్య కేంద్రాలను డాటా ఆధారంగా బీపీ బాధితులు 36,823 ఉండగా, షుగర్ బాధితులు 16,424మందిగా నమోద య్యారు. ఈ లెక్కలు చూస్తే, "ఇంకా ఎన్ని కుటుంబాల్లో ఈ నిశ్శబ్ద హంతకులు పాకిపోతున్నారో?" అనే భయం నెలకొంది. పట్టణ ప్రాంతాలకే పరిమితం కాకుండా, తాంసి, తలమడుగు, ఇచ్చోడ, బేల, జైనథ్, నేరడిగొండ వంటి మారుమూల పీహెచ్‌సీల పరిధిలో కూడా ఈ కేసు లు అధికంగా నమోదవడం, పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

## ఒక పేషెంట్ వేదన: "ఇక మందుల బాట తప్పదు"

"మూడు సంవత్సరాల క్రితం వరకు నాకెలాంటి ఆరోగ్య సమస్య లేదు. ఒక్కసారిగా తలనొప్పి, విపరీతమైన అలసట మొదలయ్యాయి. పరీక్ష చేయించుకోగా బీపీ, షుగర్ రెండూ వచ్చేశాయని డాక్టర్ చెప్పారు. అప్పటి నుంచి నా జీవితం 'మందుల బాట' పట్టింది. ఇప్పుడు ప్రతిరోజూ టాబ్లెట్స్ వేసుకోక తప్పట్లేదు. ఒక్క రోజు విస్మరించినా గుండె బరువుగా అనిపిస్తోంది" అని తన వేదనను పంచుకున్నాడు జైనథ్ మండలానికి చెందిన యువ రైతు క్యాతం వెంకటరెడ్డి. ఈ ఒక్క ఉదంతమే.. వేలమంది భారతీయుల నిత్య జీవితాన్ని ఈ వ్యాధులు ఎలా మార్చేశాయో స్పష్టం చేస్తోంది.

## రిమ్స్ డైరెక్టర్ హెచ్చరిక: నిర్లక్ష్యం కాకూడదు!

రిమ్స్ డైరెక్టర్, ఆదిలాబాద్ డాక్టర్ జైసింగ్ రాథోడ్ మాట్లాడుతూ... "30-40 ఏళ్ల మధ్య వయసులోనే బీపీ, షుగర్ కేసులు ఉధృతమవుతున్నాయి. ఒకసారి రోగం దరి చేరితే జీవితాంతం మందులు వాడాల్సిందే. ఈ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా, అది గుండెపోటు, పక్షవాతం (స్ట్రోక్), కిడ్నీ వైఫల్యం వంటి తీవ్రమైన, కోలుకోలేని పరిణామాలకు దారి తీస్తుంది. క్రమం తప్పకుండా మందులు వాడటం, కచ్చితమైన ఆహార నియమాలు పాటించడం తప్పనిసరి. ప్రజలు తమ ఆరోగ్యాన్ని తేలికగా తీసుకోవద్దు." అని గట్టిగా హెచ్చరించారు.

## జీవనశైలి మార్పే అసలైన ఔషధం

ఈ వ్యాధులను అదుపులో ఉంచడానికి, నివారించడానికి వైద్యులు సూచిస్తున్న ప్రధాన మార్గం... జీవనశైలిలో మార్పు. రోజూ కనీసం 30 నిమిషాలు వేగంగా నడక లేదా క్రమం తప్పని వ్యాయామం చేయాలి. జంక్ ఫుడ్, అధిక ఉప్పు, నూనె, చక్కెర వాడకాన్ని అత్యవసరంగా తగ్గించుకోవాలి. తాజా పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా ఆహారంలో భాగం చేసుకోవాలి. ముఖ్యంగా, ప్రస్తుత సమాజంలో పెరిగిన ఒత్తిడిని తగ్గించుకునేందుకు ధ్యానం (మెడిటేషన్), యోగా సాధన చేయడం అత్యుత్తమం.

## ఎన్సీడీ క్లినిక్‌ల ద్వారా ఉచిత వైద్యం

ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం జిల్లా కేంద్రంలో ఎన్సీడీ (నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్) క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. ఈ క్లినిక్‌ల ద్వారా రోగులకు ఉచిత పరీక్షలు, అవసరమైన మందులు అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి గుర్తించిన తీవ్రమైన కేసులను ఇక్కడికి రిఫర్ చేసి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఆరోగ్య కార్యకర్తలు (హెల్త్ వర్కర్లు) కూడా ప్రజలకు ఆహారపు అలవాట్లలో మార్పుల ఆవశ్యకతను వివరిస్తూ, మందులు ఆపొద్దని నిరంతరం అవగాహన కల్పిస్తున్నారు.



డాక్టర్ జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్, ఆదిలాబాద్

# సర్పంచ్ స్థానానికి పోటీ చేయాలంటే అర్హతలు:-

అర్హతలు:-

1. సర్పంచ్ స్థానానికి పోటీ చేయాలి అనుకునే వ్యక్తి కచ్చితంగా గ్రామపంచాయతీలో స్థానికుడై ఉండాలి.
2. ఎవరైతే పోటీ చేయాలనుకుంటున్నారో వారి పేరు పంచాయతీ ఓటింగ్ లిస్టులో నమోదై ఉండాలి.
3. సర్పంచ్ స్థానానికి నామినేషన్ దాఖలు చేసే సమయానికి పోటీ చేయాలి అనుకునే వ్యక్తి వయసు 21 సంవత్సరాలు నిండి ఉండాలి.
4. ఎస్సీ, ఎస్టీ, బీసీ కేటగిరీ అభ్యర్థులు జనరల్ కేటగిరి నుంచి కూడా పోటీ చేయడానికి ఆస్కారం ఉంది.
5. మహిళలకు రిజర్వు చేసిన స్థానాలతో పాటు అదే కేటగిరిలోని జనరల్ స్థానాల్లోనూ పోటీ చేయవచ్చు.

అనర్హులు ఎవరంటే:-

1. గ్రామ సేవకులతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, స్థానిక సంస్థల ఎయిడెడ్ సంస్థల ఉద్యోగులు సర్పంచ్ పోటీకి అనర్హులు.
2. చట్టం ద్వారా ఏర్పడిన ఏదైనా సంస్థకు చెందిన ఉద్యోగులు పోటీకి అనర్హులు.
3. నేరానికి పాల్పడి శిక్ష పడిన వారు పోటీకి అనర్హులు.
4. నేర శిక్షను అనుభవించిన తర్వాత ఐదు సంవత్సరాలు పూర్తి కాని వారు కూడా అనర్హులు.
5. మతిస్థిమితం లేని వారు. బదిరులు, మూగవారు అనర్హులు.
6. పౌరహక్కుల పరిరక్షణచట్టం-1955 పరిధిలోకి వచ్చే కేసుల్లో శిక్ష పడినవారు .
7. దివాళాదారుగా న్యాయ నిర్ణయం కోసం దరఖాస్తు చేసుకున్న వారు. రుణ విమోచన పొందని దివాళాదారు కూడా పోటీకి అనర్హుడు.
8. గ్రామ పంచాయతీ కి వ్యక్తిగతంగా బకాయిపడిన వారు. బకాయిల చెల్లింపులకు నోటీసులు ఇచ్చినా చెల్లించిన వారు పోటీకి అనర్హులు.
9. ఇద్దరు కంటే ఎక్కువ పిల్లలు ఉన్న వారు కూడా దీనికి అనర్హులే.
10. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో పనిచేసే ఉద్యోగుల తో పాటు స్థానిక సంస్థల కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు ఏదైనా అవినీతికి కానీ విశ్వాస ఘాతుకానికి గానీ పాల్పడి ఉద్యోగం నుంచి తొలగించబడితే ఆ రోజు నుంచి ఐదేళ్లు పూర్తయ్యేంతవరకు సర్పంచ్ పోటీకి అనర్హులు.

# దత్తన్న తెలుగు రాష్ట్రాలే కాదు,దేశ రాజకీయాల్లోనే అజాత శత్రువు

**రాజకీయాలకు అతీతంగా చాలా మందికి ఆయనంటే అభిమానం**

**అలయ్ బలయ్ కార్యక్రమం ద్వారా అందరిని ఒక వేదిక మీదకు తేవడం దత్తాత్రేయ గారికే సాధ్యం**

**వారికి భగవంతుడు మరింత శక్తిని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను**

**- మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి**

**హైదరాబాద్ అక్టోబర్03( సమయం న్యూస్) :** దత్తన్న తెలుగు రాష్ట్రాలే కాదు,దేశ రాజకీయాల్లోనే అజాత శత్రువనీ మాజీ గవర్నర్, మాజీ కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయను రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి కొనియాడారు. రాజకీయాలకు అతీతంగా చాలా మందికి ఆయనంటే ప్రత్యేక అభిమానమని పేర్కొన్నారు. దసరా తెల్లారి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ఇంత పెద్ద ఎత్తున ప్రముఖుల తరలి వచ్చారని అన్నారు. అలయ్ బలయ్ కార్యక్రమం ద్వారా అందరిని ఒక వేదిక మీదకు తేవడం దత్తాత్రేయ గారికే సాధ్యమని,వారు సమాజ ఐక్యత కోసం చేస్తున్న కృషి స్పూర్తి దాయకమన్నారు. బండారు దత్తాత్రేయ కు ఆ భగవంతుడు మరింత శక్తిని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నానని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ అలయ్ బలయ్ కార్యక్రమంలో సుప్రీం కోర్టు మాజీ సీ.జె ఎన్వీ రమణ,సినీనటుడు అక్కినేని నాగార్జున,ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

**ప్రముఖ కవి, రచయిత ప్రొఫెసర్ ఎన్. గోపి, ప్రముఖ కవి కె. శివారెడ్డి గారిని పరామర్శించిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గారు**

- ఎన్. గోపి గారి సతీమణి అరుణ, శివారెడ్డి గారి కుమారుడు,
- ప్రముఖ చిత్రకారుడు శంబుప్రసాద్ ఇటీవల మరణించారు





**హైదరాబాద్ అక్టోబర్3( సమయం న్యూస్,).:** గడ్డిఅన్నారంలోని శివారెడ్డి గారి నివాసానికి వెళ్లి ఆయనను కవిత ఓదార్చారు.. శివారెడ్డి గారికి ధైర్యం చెప్పారురామాంతపూర్ లోని ఎన్. గోపి గారి నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు.. కవిత వెంట తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, ముఖ్య నాయకులు కోల శ్రీనివాస్, మహేందర్, గణపురం దేవేందర్, శివారెడ్డి, రాము యాదవ్ తదితరులు ఉన్నారు



## అంబరాన్నంటిన దేవి నిమజ్జనోత్సవాలు

**సమయం న్యూస్, అసిఫాబాద్ టౌన్ :** జిల్లా కేంద్రంలోని పలు మండల ఆధ్వర్యంలో గత తొమ్మిది రోజులుగా కొనసాగుతున్న దేవీ నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం నిమజ్జనోత్సవంతో ఘనంగా ముగిసాయి. బాపునగర్ శారదా దేవి మండపం వద్ద తొమ్మిది రోజులు పూజలు అందుకున్న అమ్మవారిని పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చి శోభాయాత్రలో పాల్గొన్నారు. శోభాయాత్రను వన్ నేషన్ వన్ ఎలక్షన్ చైర్మన్ నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, డిసిసి అధ్యక్షుడు సతీమణి అన్నపూర్ణలు కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. మహిళలు ఒకే రకమైన దుస్తులు ధరించి కోలాటాలతో అంగరంగ వైభవంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు విలాస్, బాపగౌడ్, అశ్విన్, వివేక్ సుగుణాకర్, మహేందర్, శ్రీనివాస్, ఆనంద్, ప్రభాకర్, ప్రశాంత్ పాల్గొన్నారు.








# వైభవంగా విజయదశమి



- కనుల పండువగా వేడుకలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు
- ఆకట్టుకున్న రావణ దహనం



**సమయం న్యూస్, అసిఫాబాద్ :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా లో భక్తులు గురువారం వైభవంగా విజయదశమి జరుపుకున్నారు. పండుగ నేపథ్యంలో ఉదయం నుంచి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కేస్లాపూర్ హనుమాన్ మందిర్ ఆలయ ఆవరణలో పెద్ద ఎత్తున వాహన పూజలు నిర్వహించారు. విజయదశమి సందర్భంగా శ్రీరామచంద్రుని ఎంపిక కోసం లక్కీ నిర్వహించారు. శ్రీరామచంద్రుడిగా ఆసిఫాబాద్ కు చెందిన సీనియర్ జర్నలిస్టు, కవి రచయిత రాధాకృష్ణ చారి ఎంపికై రావణాసుర దహనం చేశారు. కార్యక్రమానికి తిలకించేందుకు జిల్లా కేంద్రం తో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ప్రముఖ టీవీ నిర్మాత దర్శకులు నాగబాల సురేష్ కుమార్ దసరా పండుగ విశిష్టతను గురించి ప్రసంగించారు. అనంతరం శ్రీరామునిగా ఎంపికైన రాధాకృష్ణ ను అలయ కమిటి సభ్యులు పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. దసరా ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన గౌరీస్ ఆర్కెస్ట్రా వారు పాడిన భక్తి పాటలు అలరించాయి. ఈ కార్యక్రమంలో అలయ కమిటి ఛైర్మెన్ అరిగెల నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వ ప్రసాద్ రావు, నాయకుల సురేష్ కుమార్, ఆలయ కమిటీ అధ్యక్షులు ధర్మపురి వెంకటేశ్వర్లు కార్యదర్శి గుండ వెంకన్న , గాదవేణి మల్లేష్, చిలువేరి వెంకన్న, బాలేష్ గౌడ్, పిన్న వివేక్. ఏకీరాల శ్రీనివాస్ గడ్డల వెంకన్న, రూప్నర్ రమేష్, మధు , సాయిని లక్ష్మణ, నారాయణ మూర్తి , జీవన్ పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

## అందరికి విజయాలు చేకూర్చాలి

### జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్

### జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఆయుధ, వాహన, జమ్మి పూజ



**సమయం న్యూస్, ఆసిఫాబాద్ :** విజయదశమి పండుగ ప్రజలకు విజయం చేకూర్చాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆకాంక్షించారు. గురువారం జిల్లా పోలీసు ఆర్మ్డు రిజర్వ్ హెడ్ క్వార్టర్స్ లో ఆయుధ పూజ, వాహన పూజ, జమ్మి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ దుర్గా దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులకు సిబ్బందికి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో నిత్యం అప్రమత్తంగా ఉండే పోలీసులు తమ విధి నిర్వహణలు ఉపయోగించే ఆయుధాలను వాహనాలను దైవ స్వరూపంగా భావించి ప్రత్యేక పూజలు నిర్వహించడం సాంప్రదాయంగా వస్తుందని ఎస్పీ తెలిపారు. అనంతరం పోలీస్ అధికారులు ,సిబ్బంది స్నేహపూర్వక వాతావరణం లో అలాయ్ బలయ్ నిర్వహించి, విజయదశమి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎఎస్పీ చిత్తరంజన్ ,ఆర్.ఐ లు అంజన్న, పెద్దన్న, ఆసిఫాబాద్ సీఐ బాలాజీ వరప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రాణా ప్రతాప్, ఆర్.ఎస్.ఐ లు, ఎస్.ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.

## సోలార్ పెన్సింగ్ తీగ తట్టుకొని కౌలు రైతు మృతి



**సమయం న్యూస్, నేరడిగొండ:** సోలార్ తీగ తట్టుకొని కౌలు రైతు మృతి చెందిన ఘటన గురువారం మండలంలోని తేజాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై ఇమ్రాన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తేజాపూర్ గ్రామానికి చెందిన ఏలేటి నారాయణ రెడ్డి (59) అదే గ్రామానికి చెందిన ఆలూరి శ్రీనివాస్ రెడ్డి చేను రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని పంట సాగు చేస్తున్నాడు. కోతుల బేడద ఎక్కువ కావడంతో వాటి నుంచి పంటను రక్షించు కోవటానికి సోలార్ పెన్సింగ్ తీగను చేను చుట్టూ అమర్చారు. గురువారం ఉదయం కోతులు ఎక్కువ వచ్చాయన్న సమాచారం అందుకొని హడావిడిగా చేను వైపు వెళ్లాడు. అదే క్రమంలో సోలార్ తీగ తట్టుకొని రాయిపై పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రైవేట్ వాహనంలో బోథ్ ఏరియా ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

## సొంత గూటికు చేరుతున్న ధనుజయ్ పాటిల్



**సమయం న్యూస్, కామారెడ్డి ప్రతినిధి:** డోంగ్లీ మండల బీజేపీ పార్టీ అధ్యక్షుడు ధనుజయ్ పాటిల్ బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. బీజేపీ పార్టీకు గుడ్ బాయ్ చేస్తున్నారు. ఎమ్మెల్యే లక్ష్మికాం తారావు పనితనం, అభివృద్ధిని చూసి ఎమ్మెల్యే సొంత గూటికి రావాలని తెలిపారు. సానుకూలంగా స్పందించి కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పనితీరుపై సంతోషం వ్యక్తం చేశారు. ప్రజల్లో మంచి పేరు ఉన్న వ్యక్తి ధనుజయ్ పాటిల్ కాంగ్రెస్ లో వచ్చి ప్రజా సేవ చేయాలని, స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని కాంతారావు తెలియజేశారు. ధనుజయ్ పాటిల్ మాట్లాడుతూ అందరు కాంగ్రెస్ పార్టీ తరపున చూస్తున్నారని, నాతో పాటు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ వారు కూడా చేరడం జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్యే కాంతరావు రాత్రింబవళ్లు అనకుండా ప్రాణాలకు లెక్క చేయకుండా వరద బాధితులకు దగ్గరుండి నేనున్నానని ధైర్యం ఇచ్చారని అన్నారు. జుక్కల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ వచ్చినప్పటి నుంచి అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, పనులను చూసి కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో చేరడం జరుగుతుందని తెలిపారు. దీంతో పాటు బీజేపీ బూత్ అధ్యక్షులు, బీఆర్ఎస్ వారు అధిక సంఖ్యలో కండువా వేసుకుంటారని వివరించారు.

## సత్ప్రవర్తనతో మెలగాలి



**సమయం న్యూస్, ఆసిఫాబాద్ టౌన్:** ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం గాంధీ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో గల జిల్లా సబ్ జైల్ లో గాంధీ జయంతిని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ ప్రేమ్ కుమార్‌తో కలిసి హాజరై గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ అహింసా మార్గంలో ఉద్యమించి దేశానికి స్వాతంత్రం తీసుకొచ్చారని, ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని, గాంధీజీ చూపిన మార్గంలో నడవాలని తెలిపారు. క్షణికావేశంలో చేసిన పొరపాట్లకు వలన కుటుంబానికి దూరంగా ఉండి శిక్షలు అనుభవించడం జరుగుతుందని, భవిష్యత్తులో అహింసా మార్గంలో నడిచి సమాజ సేవకు ముందుకు రావాలని తెలిపారు. జైలులో ఖైదీలకు మెరుగైన వసతులు కల్పించాలని జైలర్‌కు సూచించారు. అనంతరం ఖైదీలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ సి.ఐ. బాలాజీ వరప్రసాద్, డిప్యూటీ జైలర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి జీఎంపై చర్యలు తీసుకోవాలి

### ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ ప్రెసిడెంట్

**సమయం న్యూస్, ఆసిఫాబాద్ :** సింగరేణి బెల్లంపల్లి ఏరియా జిఎం పై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజినల్ ప్రెసిడెంట్ బోగి ఉపేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం లారీ డ్రైవర్లకు క్లీనర్లకు ఇన్సెంటివ్ చెల్లించాలని రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ నిర్లక్ష్యం కారణంగా కార్మికులకు ఇప్పటివరకు ఇన్సెంటివి చెల్లించడం లేదని అన్నారు. కాంట్రాక్టర్లు ఇచ్చే కమిషన్లకు అలవాటు పడి,కాంట్రాక్టర్లకు జిఎం ఊడిగం చేస్తున్నారని, లారీ డ్రైవర్లు, క్లీనర్లకు స్పెషల్ ఇంసెంటివ్ 5,500 చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన స్పెషల్ ఇన్సెంటివ్ 5500 ఇప్పటివరకు లారీ డ్రైవర్లకు క్రీడలకు చెల్లించలేదని, దీంతో కార్మికులు పండుగ పూట పస్తులు ఉన్నారని అన్నారు. ఏరియా జనరల్ మేనేజర్ నిర్లక్ష్యం కారణంగానే కార్మికులు పండుగ పూట పస్తులు ఉండవలసిన పరిస్థితి వచ్చిందని అన్నారు. ఇప్పటికైనా అర్హులైన లారీ డ్రైవర్లు క్రీడలకు స్పెషల్ ఇన్సిట్యూట్ 5500 వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం వహించిన ఏరియా జనరల్ మేనేజర్ తో పాటు ఇతర అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రాయిల్లా నర్సయ్య, కార్మికులు అశోక్,సతీష్, రాజశేఖర్ రాజలింగ్, శ్రీకాంత్, శ్రీనివాస్, రవీందర్, రాజన్న, వెంకటేష్, హనుమంతు, శ్యామ్ రావు, విష్ణువర్ధన్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



## గాంధీ చూపిన మార్గంలో నడుద్దాం



**సమయం న్యూస్, ఆసిఫాబాద్ కలెక్టరేట్ :** మహాత్మా గాంధీ చూపిన మార్గంలో నడుద్దామని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం గాంధీ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకలలో పాల్గొని గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని, అహింసా మార్గం ద్వారా స్వాతంత్రం సాధించడంలో యావత్ ప్రపంచానికి స్ఫూర్తి దాతగా నిలిచారని అన్నారు. మహాత్మా గాంధీ స్ఫూర్తితో సమాజ సేవ చేసేందుకు ముందుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి శివకుమార్, తహసిల్దార్ రియాజ్ అలీ, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

04-10-25 Samayam_Layout 1 10/4/2025 4:41 AM Page 11



# భారీ ఆధిక్యం దిశగా భారత్



- రాహుల్, జురేల్, జడేజా సెంచరీలు
- విండీస్ పై పూర్తి ఆధిపత్యం
- 162 పరుగులకే విండీస్ ఆలౌట్
- అహ్మదాబాద్‌లో వెస్టిండీస్‌తో తొలి టెస్ట్
- వెస్టిండీస్‌పై నిప్పులు చెరిగిన సిరాజ్..

అహ్మదాబాద్‌లో వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్‌లో జడ్డు సెంచరీతో అదరగొట్టాడు. ఇటీవల ఇంగ్లాండ్ పర్యటనలో అదరగొట్టిన జడ్డూ, మరోసారి తన ఫామ్ చాటుకున్నాడు. ఈ క్రమంలోనే అరుదైన ఘనత సాధించాడు. టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక సిక్స్‌లు బాదిన భారత బ్యాటర్లలో రవీంద్ర జడేజా, ఎంఎస్ ధోనిని అధిగమించాడు. ఈ మ్యాచ్‌లో కరేబియన్ బౌలర్ జోమెల్ వారికన్ వేసిన బంతి, జడేజా అద్భుతమైన సిక్స్‌గా మలిచాడు. ఇది అతని టెస్ట్ కెరీర్‌లో 78వ సిక్స్. ఎంఎస్ ధోని కూడా టెస్టుల్లో 78 సిక్సర్లే సాధించాడు. ఆ తర్వత మరో సిక్స్‌తో ధోనిని అధిగమించాడు. ప్రస్తుతం జడ్డూ 79 సిక్స్‌లతో ఉన్నాడు. భారత బ్యాటర్లలో రోహిత్ శర్మ (88 సిక్స్‌లు), రిషభ్ పంత్ (90 సిక్స్‌లు), వీరేంద్ర సెహ్వాగ్ (91 సిక్స్‌లు) మాత్రమే జడేజా కంటే ముందున్నారు. వీరిలో రిషభ్ పంత్ ఒక్కడే ఇప్పటికీ టెస్ట్ క్రికెట్ ఆడుతున్నాడు. అయితే, ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో గాయపడిన పంత్, ప్రస్తుత వెస్టిండీస్ సిరీస్‌లో ఆడటం లేదు. ఓపెనర్ కేఎల్ రాహుల్ అద్భుత శతకంతో సత్తా చాటాడు. మొదటి రోజు అర్ధశతకం పూర్తి చేసిన అతడు, రెండో రోజు లంచ్‌కు కొద్ది నిమిషాల ముందు 100 పరుగుల మార్క్ అందుకున్నాడు. 190 బంతుల్లో అతడు సెంచరీ సాధించాడు. ఈ ఇన్నింగ్స్?లో 12 ఫోర్లు ఉన్నాయి. టెస్టుల్లో అతడికిది 11వ సెంచరీ. కానీ స్వదేశంలో మాత్రం రెండో శతకమే. ఇంతకుముందు 2016లో చెన్నైలో ఇంగ్లాండ్‌పై సెంచరీ నమోదు చేశాడు. అయితే, లంచ్ తర్వాత బ్యాటింగ్‌కు తిరిగి వచ్చిన రాహుల్, ఒక్క పరుగు కూడా జోడించకుండా పెవిలియన్‌కు చేరాడు. అంతకుముందు, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 100 బంతుల్లో 50 పరుగులు చేశాడు. అంతకుముందు టాస్ నెగ్గిన విండీస్ బ్యాటింగ్ ఎంచుకుంది. కానీ భారత బౌల్లర్లు తొలి ఇన్నింగ్స్?లో విండీస్ బ్యాటర్లకు చుక్కలు చూపించారు. దీంతో విండీస్ 162 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జస్టిన్ గ్రేవ్స్ (32 పరుగులు) టాప్ స్కోరర్. ఓపెనర్లు జాన్ కాంమెల్ (8), చందర్?పాల్ (0) స్వల్ప స్కోర్లు చేశారు. అలిక్ (12), బ్రెండన్ కింగ్ (13), రోస్టన్ ఛేజ్ (24), షయ్ హెూప్ (26), పెర్రి (11), వారికన్ (8), లేన్ (1) అందరూ స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. టీమ్ఇండియా బౌలర్లలో మహ్మద్ సిరాజ్ 4, జస్ప్రీత్ బుమ్రా 3, కుల్దీప్ 2, వాషింగ్టన్ సుందర్ 1 వికెట్లు దక్కించుకున్నారు.మిండియా స్టార్ పేసర్, హైదరాబాద్ డీఎస్పీ మహమ్మద్ సిరాజ్ నిప్పులు చెరిగాడు. టాస్ ఓడి బౌలింగ్‌కు దిగిన టీమిండియాకు అదిరిపోయే ఆరంభాన్ని అందించాడు. తన తొలి స్పెల్‌లోనే సిరాజ్ 3 వికెట్లు పడగొట్టి విండీస్ పతనాన్ని శాసించాడు. దాంతో సిరాజ్‌పై నెటిజన్లు ప్రశంసల జల్లు కురుస్తోంది. సిరాజ్ ధాటికి వెస్టిండీస్ 90 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. సిరాజ్‌తో పాటు కుల్దీప్ యాదవ్, బుమ్రా చెరో వికెట్ తీసారు. ఈ మ్యాచ్ ఆరంభంలోనే తేజ్‌నారాయణ్ చందర్-పాల్(0)ను సిరాజ్ కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. ఆ వెంటనే జాన్ కాంప్‌బెల్(8)ను జస్ప్రీత్ బుమ్రా కీపర్ క్యాచ్‌గా ఔట్ చేశాడు. క్రీజులోకి వచ్చిన బ్రాండన్ కింగ్(13)ను స్టన్నింగ్ డెలివరీతో క్లీన్ బౌల్డ్ చేసిన సిరాజ్.. ఆచితూచి ఆడిన అలిక్ అథనాసియస్(12)ను క్యాచ్ ఔట్‌గా వెనక్కిపంపాడు. అతను కొట్టిన షాట్ నేరుగా స్లిప్‌లో ఉన్న కేఎల్ రాహుల్ చేతిలో పడింది.దాంతో వెస్టిండీస్ 42 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. ఈ పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ రోస్టన్ ఛేజ్(22 బ్యాంటింగ్) షైహెూప్(26) ఆచితూచి ఆడుతూ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. 48 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో సెట్ అయిన ఈ జోడీని విడదీసేందుకు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్పిన్నర్లను రంగంలోకి దించాడు. కెప్టెన్ నమ్మకాన్ని నిలబెట్టుకున్న కుల్దీప్ యాదవ్ తన రెండో ఓవర్‌లోనే షైహెూప్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. ఈ వికెట్ అనంతరం అంపైర్లు లంచ్ బ్రేక్ ప్రకటించారు.ఇంగ్లండ్ పర్యటనలో అద్భుత ప్రదర్శన కనబర్చిన సిరాజ్.. అదే జోరును సొంతగడ్డపై కొనసాగిస్తున్నాడు. సొంతగడ్డపై సిరాజ్ రాణించలేడనే విమర్శలను తుడిచిపెట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్‌ల సిరీస్‌ను టీమిండియా 2-2తో డ్రా చేసుకున్న సంగతి తెలిసిందే. ఆఖరి టెస్ట్‌లో సిరాజ్ అద్భుత ప్రదర్శనతో టీమిండియాకు చిరస్మరణీయ విజయాన్నందించాడు. ఈ పర్యటనలో అతను ఐదు టెస్ట్‌లు ఆడి 23 వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో సిరాజ్5 వికెట్ల ఘనతను అందుకోవాలని ఫ్యాన్స్ ఆకాంక్షిస్తున్నారు. ప్రస్తుతం సిరాజ్ వికెట్లకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి.





## ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో మీరాబాయి అద్భుతం

వెయిట్ లిఫ్టింగ్ ప్రపంచ ఛాంపియన్ షిప్‌లో భారత స్టార్ మహిళా వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను అద్భుత ప్రదర్శన చేసింది. 48 కిలోల విభాగంలో మీరాబాయి చాను రజత పతకాన్ని గెలుచుకుంది. నార్వేలో జరిగిన ప్రతిష్టాత్మక పోటీలో మీరాబాయి చాను మొత్తం 199 కిలోల( స్నాచ్ లో 84 కిలోలు, క్లీన్ అండ్ జర్క్‌లో 115 కిలోలు) బరువు ఎత్తింది. గతంలో రెండు సార్లు మెడల్ సాధించిన ఈ టోర్నమెంట్?లో ఇప్పుడు మరోసారి అదరగొట్టింది. మహిళల 48 కిలోల విభాగంలో స్వర్ణాన్ని కోల్పోయి, వెండి పథకంతో ముగించింది. మీరాబాయి స్నాచ్‌లో తన మొదటి ప్రయత్నంలోనే 84 కిలోలు ఎత్తింది. అయితే, తర్వాత రెండు లిఫ్ట్‌లను 87 కిలోల వద్ద తడబడింది. దీంతో ఆమె పోడియం ఫినిషింగ్ కోసం పోటీలో ఉండటానికి క్లీన్ అండ్ జెర్క్‌లో 110 కిలోలకు పైగా వెయిట్? చేయాల్సి వచ్చింది. అయితే మీరాబాయి క్లీన్ అండ్ జెర్క్‌లో రాణించింది. 109 కిలోల బరువుతో ప్రారంభించి, 112 కిలోలకు మెరుగుపడి, 115 కిలోల లిఫ్ట్‌తో ముగించింది. ఈవిధంగా ఆమె మొత్తం 199 కిలోల బరువు ఎత్తి సిల్వర్ సొంతం చేసుకుంది. ఉత్తర కొరియాకు చెందిన రి సాంగ్-గమ్ 213 కిలోలు ఎత్తి వరల్డ్ రికార్డు సాధించి, గోల్డ్ మెడల్‌ను గెలుచుకుంది. మీరాబాయికి 2022 ఎడిషన్‌లో విజయం తర్వాత ప్రస్తుతమిది రెండో సిల్వర్ మెడల్. మొత్తం మీద, ఈ ఈవెంట్‌లో ఇది మీరాబాయ్?కు మూడో పతకం. 2017లో జరిగిన ఈ ఈవెంట్‌లో ఆమె బంగారు పతకాన్ని సాధించింది. ఓవరాల్‌గా ఆమెకు ఇది 14వ ఇంటర్‌నెష్నల్ మెడల్. తన ఖాతాలో 2021 టోక్యో ఒలింపిక్స్‌లో రజతం, కామన్వెల్త్ క్రీడల్లో మూడు పతకాలు (2018, 2022లో స్వర్ణం, 2014లో రజతం), కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్‌లలో అయిదు (నాలుగు స్వర్ణాలు, ఒక రజతం), 2020 ఆసియా ఛాంపియన్‌షిప్‌లో ఒక బ్రాంజ్? పతకం, 2016 దక్షిణాసియా క్రీడల్లో ఒక గోల్డ్? ఉన్నాయి. లవ్‌ప్రీత్ సింగ్, గతంలో కామన్వెల్త్ గేమ్స్‌లో కాంస్య పతకం సాధించిన భారత వెయిట్‌లిఫ్టర్‌గా, ఇప్పుడు పురుషుల బృందానికి నాయకత్వం వహిస్తున్నాడు. అజిత్ నారాయణ, అజయ్ బాబు వల్లూరి ఇద్దరూ కామన్వెల్త్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణాలు గెలిచిన విజయవంతమైన క్రీడాకారులు.

**భారత బృందం (2025 వరల్డ్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్స్):**

**మహిళలు:**

మీరాబాయి చాను (48 కిలోలు)
కోయెల్ బార్ (53 కిలోలు)
బింద్యారాణి దేవి సోరోఖైబం (58 కిలోలు)
నిరుపమా దేవి సేరామ్ (63 కిలోలు)
హర్జిందర్ కౌర్ (69 కిలోలు)
వన్షిత వర్మ (86 కిలోలు)
మెహక్ శర్మ (86 కిలోలు పైన)

**పురుషులు:**

రిషికాంత్ సింగ్ చనంబం (60 కిలోలు)
ముత్తుపాండి రాజా (65 కిలోలు)
అజిత్ నారాయణ (71 కిలోలు)
అజయ్ బాబు వల్లూరి (79 కిలోలు)
అభిషేక్ నిపానే (88 కిలోలు)
దిల్బాగ్ సింగ్ (94 కిలోలు)
లవ్‌ప్రీత్ సింగ్ (110 కిలోలు పైన)





## చరిత్ర సృష్టించిన సిరాజ్

భారత్- వెస్టిండీస్ మధ్య అహ్మదాబాద్ వేదికగా జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో టీమ్ఇండియా స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్ చరిత్ర సృష్టించాడు. టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న వెస్టిండీస్?ను భారత్ బౌలర్లు తీవ్రంగా దెబ్బకొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో సిరాజ్ నాలుగు కీలక వికెట్లు పడగొట్టి, కరేబియన్ జట్టు టాప్ ఆర్డర్‌ను చాప చుట్టేశాడు. ఈ అద్భుత ప్రదర్శనతో 2025 క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక వికెట్లు (31 వికెట్లు) సాధించిన బౌలర్‌గా రికార్డు సృష్టించాడు. ఆస్ట్రేలియా బౌలర్లు మిచెల్ స్టార్క్ (29 వికెట్లు), నాథన్ లైయన్ (24 వికెట్లు), వెస్టిండీస్ పేసర్ షామర్ జోసెఫ్ (22 వికెట్లు)లను వెనక్కి నెట్టాడు. సిరాజ్ ఇటీవలి కాలంలో టీమ్ఇండియా బౌలింగ్ దళంలో కీలక ఆటగాడిగా మారాడు. కొత్త బంతితో ప్రత్యర్థి బ్యాటర్లను ఆటలోకి రానీయకుండా చేయడంలోనూ, క్రీజులో స్థిరపడిన ఆటగాళ్లను తన వేగవంతమైన బౌలింగ్‌తో పెవిలియన్‌కు చేర్చడంలోనూ సిద్ధహస్తుడిగా నిరూపించుకున్నాడు. జస్ప్రీత్ బుమ్రా గైర్హాజరీలో బౌలింగ్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ జట్టును ముందుండి నడిపిస్తున్నాడు. ఇటీవల ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో సిరాజ్ అసాధారణ ప్రదర్శన కనబరిచాడు. ముఖ్యంగా ఐదో టెస్టులో జట్టు విజయం సాధించి సిరీస్‌ను సమం చేయడంలో అతడి పాత్ర కీలకంగా నిలిచింది. ప్రస్తుత వెస్టిండీస్ సిరీస్‌లోనూ తన నాలుగు వికెట్లతో మ్యాచ్‌ను భారత్ వశం చేసుకునేలా చేశాడు. రెడ్ బాల్ క్రికెట్‌లో సిరాజ్ తన స్థాయిని మరోసారి చాటాడు. టీమ్ ఇండియాకు టెస్టు ఫార్మాట్‌లో విజయాలను అందిస్తూ బౌలింగ్ రీతిలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్నాడు.

## బంగ్లాదేశ్ చేతిలో చిత్తుగా ఓడిన పాకిస్థాన్

2025 మహిళల వరల్డ్ కప్‌లో భాగంగా పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్ విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ 7 వికెట్ల తేడాతో నెగ్గింది. 130 పరుగులు ఛేదనను బంగ్లా జట్టు 31.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 38.3 ఓవర్లలో 129 పరుగులకు కుప్పకూలింది.టాస్ గెలిచిన బ్యాటింగ్‌కు దిగిన పాక్ మహిళా బ్యాటర్లకు బంగ్లా బౌలర్లు చుక్కలు చూపించారు. కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో పాక్ మహిళల జట్టును 38.3 ఓవర్లలో 129 పరుగులకే ఆలౌట్ చేశారు. రమీన్ షమీమ్ (23), ఫాతిమా సనా (22), మునీబా అలీ (17), దయానా బేగ్ (16), సిద్రా నవాజ్(15) అలియా రియాజ్ (13) ఇలా ఏ ఒక్కరూ బ్యాటింగ్‌లో బంగ్లా మహిళా బౌలర్ల ధాటికి నిలవలేకపోయారు. షోర్నా అక్తర్ మూడు వికెట్లు తీయగా, మరూఫా అక్తర్, నహిదా అక్తర్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. నిషితా అక్తర్, ఫాతిమా, రబేయా ఖాన్‌లు తలో వికెట్ దక్కించుకున్నారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బంగ్లా మహిళల జట్టుకు ఆదిలోనే ఎదురు దెబ్బ తగిలింది. ఫర్గానా (2), షర్మిన్ అక్తర్ (10) తక్కువ పరుగులకే ఔటయ్యారు. ఈ క్రమంలో రుబియా హైదర్ అర్ధశతకంతో (54బీ 77 బంతుల్లో 8ఐ4) రాణించడమే కాకుండా నాటౌట్‌గానూ నిలిచింది. నిగర్ సుల్తానా (23), శోభన మోస్తరీ (24) జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. పాక్ బౌలర్లలో ఫాతిమా, దయానా బేగ్, రమీన్ షమీమ్ తలో వికెట్ తీశారు.



04-10-25 Samayam_Layout 1 10/4/2025 4:41 AM Page 12



## మన శంకర వరప్రసాద్‌గారులో
# ఉదిత్ నారాయణ్ పాట




కమర్షియల్ హంగులతో చక్కటి వినోదాన్ని పంచే దర్శకుడు అనిల్ రావిపూడి కొత్త పంథాను అనుసరిస్తున్నారు. ఈ ఏడాది సంక్రాంతి కానుకగా వెంకటేశ్‌తో 'సంక్రాంతికి వస్తున్నాం' తీసి బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్నారు. ఇక ఇందులోని 'గోదారి గట్టుమీద' పాటను రమణ గోగులతో పాడించి నేటి యువతరాన్ని సైతం కట్టిపడేశారు. ఇప్పుడు అలనాటి క్రేజీ గాయకుడు ఉదిత్ నారాయణ్‌తో మేజిక్ క్రియేట్ చేసేందుకు అనిల్ రావిపూడి సిద్ధమయ్యారు. ఆయన దర్శకత్వంలో చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'మన శంకర వరప్రసాద్‌గారు'. నయనతార కథానాయిక. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా సినిమాను తీసుకొచ్చేందుకు ముస్తాబు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ఉదిత్ నారాయణ్‌తో ఓ పాట పాడిస్తున్నారు. 90 దశకం చివరిలో 2000 సంవత్సరం తర్వాత వచ్చిన తెలుగు సహా ఇతర భాషల్లో ఉదిత్ నారాయణ్ స్వరం శ్రోతలను ఓ ఊపు ఊపేసింది. మరీ ముఖ్యంగా తెలుగులో ఆయన పాటలకు విశేషమైన క్రేజ్ ఉండేది. చిరంజీవి నటించిన చిత్రాల్లోని 'రామ్మా చిలకమ్మా..', 'కైకలూరి కన్నె పిల్ల..', 'వానా వానా వెన్నెల వానా...' వంటి పాటలను ఉదిత్ నారాయణ్ ఆలపించారు. అవి ఎవర్‌గ్రీన్‌గా నిలిచాయి. ఇప్పుడు మరోసారి 'మీసాల పిల్ల' అంటూ తన స్వరంతో అలరించబోతున్నారు. దీనికి చిరంజీవి డ్యాన్స్, గ్రేస్ తోడైతే వెండితెరపైన నిజంగా సంక్రాంతి సందడే.

# రాజుగారి గది 4: శ్రీచక్రం

### ఆరేళ్ల గ్యాప్ తరవాత ఓంకార్ ప్రకటన



తెలుగు ప్రేక్షకుల్ని భయపెట్టిన హారర్ ఫ్రాంచైజీ 'రాజు గారి గది' ఇప్పుడు మళ్లీ మెరుపులు మెరిపించేందుకు సిద్ధమవుతోంది. యాంకర్–డైరెక్టర్ ఓంకార్ ఆరేళ్ల గ్యాప్ తర్వాత ఈ సిరీస్‌లో నాలుగో భాగాన్ని ప్రకటించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ చిత్రం పేరు రాజు గారి గది 4: శ్రీచక్రం. తాజాగా విడుదలైన ఫస్ట్ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో కాళికా మాత ఉగ్రరూపంలో దర్శనం ఇవ్వగా, ఎర్రచీరలో ఉన్న ఓ మహిళ దేవీ వైపు నడుచుకుంటూ వెళ్తుండటం హారర్, మిస్టికల్ ఎలిమెంట్స్‌ను సూచిస్తోంది. పోస్టర్‌కు జత చేసిన ట్యాగ్ లైన్ ఆసక్తి రేపుతుంది. ఈసారి కథా నేపథ్యం పూర్తిగా భక్తి, భయాల మిశ్రమంగా ఉండనుంది. 'కాళికాపురం' అనే ఊరిలోని కాళికా మాత ఆలయం, శ్రీచక్రం మహిమ, భక్తి వల్ల మేల్కొనే అమ్మవారు వంటి అంశాలతో హారర్, థ్రిల్లర్, కామెడీని మిక్స్ చేస్తూ ఓ కొత్త డైవైన్ యూనివర్స్‌ను నిర్మించనున్నట్టు చిత్రబృందం వెల్లడించింది. రాజు గారి గది హిట్ కావడంతో దానికి సీక్వెల్స్ చేస్తూ వస్తున్నారు ఓంకార్. ఇప్పటికే రాజు గారి గది2, రాజు గారి గది3 చిత్రాలు హిట్ కావడంతో రాజు గారి గది4 కు శ్రీకారం చుట్టారు. 'రాజు గారి గది 4: శ్రీచక్రం' సినిమా 2026 దసరా సందర్భంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రారంభ దశలో ఉన్న స్క్రిప్ట్ వర్క్ పూర్తయిన తర్వాత షూటింగ్ మొదలవుతుంది. 2015లో వచ్చిన 'రాజు గారి గది' బాక్సాఫీస్ దగ్గర విజయాన్ని నమోదు చేయగా, 2017లో 'రాజు గారి గది 2', 2019లో 'రాజు గారి గది 3' ప్రేక్షకులను అంతగా అలరించకలేకపోయాయి. అందుకే ఓంకార్ గ్యాప్ తీసుకుని మళ్లీ ఈ కొత్త కాన్సెప్ట్‌తో తిరిగి వస్తున్నారు. భక్తి, హారర్, థ్రిల్లర్ మేళవింపుతో 'శ్రీచక్రం' కథ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించనుంది. క్యాస్టింగ్‌కి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది.





# జాతీయ అవార్డులపై విమర్శలు సరికాదు

### రాణిముఖర్జీ

ఇటీవల మొదటిసారి నేషనల్ అవార్డును అందుకున్న బాలీవుడ్ నటి రాణీ ముఖర్జీ ,జాతీయ అవార్డుతో తన బాధ్యత మరింత పెరిగిందని చెప్పారు. ఆ పురస్కారాలు ప్రకటించినప్పుడు కొన్నిసార్లు వచ్చే విమర్శలపై స్పందించారు. అవార్డులు ప్రకటించినప్పుడు ఎవరైనా ప్రశ్నిస్తే వాటి విలువ తగ్గిపోతుందన్నారు. 'దేశవ్యాప్తంగా అభిమానులను సొంతం చేసుకోవడం ఆనందంగా ఉంది. మనకు నేషనల్ అవార్డు ప్రకటించినప్పుడు ప్రేక్షకులు కూడా మనం దానికి అర్హులమని భావిస్తే వచ్చే సంతోషం మాటల్లో చెప్పలేం. అలా కాకుండా 'ఆమె నటనకు పురస్కారం వచ్చిందా?. ఆమె కంటే గొప్పవారు చాలామంది ఉన్నారు' అని కామెంట్స్ వినిపించాయంటే దాన్ని అందుకున్నప్పటికీ విలువ ఉండదు. తాజాగా నాకు జాతీయ పురస్కారం వచ్చినప్పుడు అందరూ అంగీకరించారు. వారి అంగీకారం నాకు అవార్డు కంటే గొప్పగా అనిపించింది. నటీనటులకు చిన్న పురస్కారం కూడా ముఖ్యమే. ప్రేక్షకులను అలరించడమే మా ప్రధాన ఉద్దేశం. మాకు గౌరవం, గుర్తింపు వచ్చాయంటే అభిమానులు కూడా ఆనందిస్తారు' అని రాణి చెప్పారు. 2023లో విడుదలైన 'మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే' సినిమాకు గాను రాణీ ముఖర్జీ ఉత్తమ నటిగా జాతీయ అవార్డును సొంతం చేసుకున్నారు.

# ఏముందిరా అమ్మడు..

### నీలిరంగు చీరలో రాశి ఖన్నా సొగసులు..

సౌత్ సినీప్రియులకు ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేని పేరు రాశి ఖన్నా. తెలుగు, తమిళంలో వరుస సినిమాలతో అలరించిన ఈ అమ్మడు.. ఇప్పుడు బాలీవుడ్ ఇండస్ట్రీలో బిజీగా ఉంటుంది. హిందీలో వరుస అవకాశాలు అందుకుంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంటుంది. తాజాగా ఈ అమ్మడు లేటెస్ట్ ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి. తెలుగులో వరుస సినిమాలతో తనకంటూ మంచి ఇమేజ్ క్రియేట్ చేసుకున్న హీరోయిన్ రాశి ఖన్నా. ప్రస్తుతం ఈ అమ్మడు హిందీలో బ్యాక్ టూ బ్యాక్ సినిమాలతో అలరిస్తుంది. ఇటీవలే సిద్ధార్థ్ మల్హోత్రా సరసన యోధ చిత్రంలో నటించింది. కానీ మీకు తెలుసా.. రాశి ఖన్నా చిన్నప్పటి నుంచి నటి కావాలని అనుకోలేదు. జాన్ అబ్రహం చిత్రం "మద్రాస్ కేఫ్" తో రాశి ఖన్నా తన కెరీర్‌ను ప్రారంభించింది. ఈ చిత్రంలో ఆమె పాత్ర చాలా చిన్నది. ఆ తర్వాత తెలుగు, తమిళంలో వరుస అవకాశాలు అందుకుంది. ఇప్పుడు ఈ అమ్మడు పాన్ ఇండియా హీరోయిన్.. నెట్టింట విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. మలయాళ పరిశ్రమలో, "విలన్" చిత్రంతో నటిగా మంచి మార్కులు కొట్టేసింది. కొన్ని రోజుల ఫర్జీ అనే వెబ్ సిరీస్ చేసింది. అయితే కొన్నాళ్లుగా తెలుగులో ఈ బ్యూటీకి అంతగా అవకాశాలు తగ్గిపోయాయి. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి. నీలిరంగు చీరలో గ్లామర్ ఫోజులతో మతిపోగొట్టేస్తుంది ఈ వయ్యారి. ఊహలు గుసగుసలాడే సినిమాతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ.. ఆ తర్వాత గోపిచంద్ సరసన జిల్ సినిమాలో మెరిసింది. ఈ బ్యూటీ అందాలకు ఇప్పుడు కుర్రకారు ఫిదా అవుతున్నారు

## నానితో సినిమాకు క్లాప్ కొట్టిన
# ఓజి దర్శకుడు సుజీత్



ఓజి విడుదల కాక ముందే నాని హీరోగా దర్శకుడు సుజీత్ ఓ సినిమా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఏడాది దాటినా మరో అప్‌డేట్ లేకపోవడంతో ఈ చిత్రం క్యాన్సిల్ అయిందనే రూమర్స్ ఇటీవల వచ్చాయి. 'ఓజీ' ప్రమోషన్స్‌లోనే సుజీత్ వాటికి చెక్ పెట్టారు. నానితో సినిమా ఉంటుందని స్పష్టం చేశారు. తాజాగా ఈ చిత్రాన్ని ప్రారంభించారు. దసరాని పురస్కరించుకుని ఈ సినిమాని లాంఛనంగా హైదరాబాద్‌లో ప్రారంభించారు. ఈ వేడుకకు హీరో వెంకటేశ్ ముఖ్య అతిథిగా హాజరై, ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టారు. చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. సంబంధిత ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. సినిమాలోనూ కలిసి నటిస్తున్నారా? అంటూ అభిమానులు కామెంట్లు పెడుతున్నారు. రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుందని, మరిన్ని అప్‌డేట్స్ రాబోతున్నాయని నిర్మాత వెంకట్ బోయనపల్లి తెలిపారు. సుజీత్ 'ఓజీ' విజయాన్ని ఆస్వాదిస్తుండగా.. నాని 'ది ప్యారడైజ్'లో నటిస్తున్నారు. 'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న చిత్రమిది. నానితో చేయబోయే సినిమా 'ఓజీ' యూనివర్స్‌లోకి వస్తుందా? అన్న ప్రశ్నకు ఇటీవల సుజీత్ సమాధానమిచ్చారు. తన తొలి సినిమా 'రన్ రాజా రన్' స్టైల్‌లో ఉంటుందని, 'ఓజీ' యూనివర్స్‌లో భాగం కాదని తెలిపారు. ఈ చిత్రానికి 'బ్లడీ రోమియో' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. కానీ, అధికారిక ప్రకటన లేదు.

# నా కుమార్తె నగ్న చిత్రాలు అడిగారు

### నటుడు అక్షయ్ కుమార్

బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ సైబర్ నేరాల గురించి మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముంబైలో జరిగిన సైబర్ నేరాల అవగహన సదస్సులో పాల్గొన్న అక్షయ్ తన కుమార్తె ఎదుర్కొన్న ఒక అంశాన్ని గుర్తు చేశారు. తన 13 ఏళ్ల కుమార్తె వీడియో గేమ్ ఆడుతున్నప్పుడు జరిగిన ఒక కలతపెట్టే సంఘటనను పంచుకున్నారు. పిల్లల చేతిలో మొబైల్ ఉండటం వల్ల ఒక్కోసారి వారు కూడా సైబర్ నేరాల ఉచ్చులో చిక్కుకోవాల్సి ఉ ంటుందని ఆయన తెలిపారు. సైబర్ నేరగాళ్లు తన కుమార్తెతో ఎలా ప్రవర్తించారో ఇలా పంచుకున్నారు. "కొన్ని నెలల క్రితం నా ఇంట్లో జరిగిన ఒక చిన్న సంఘటనను మీ అందరికీ చెప్పాలనుకుంటున్నాను. నా కుమార్తె ఆన్‌లైన్ వీడియో గేమ్ ఆడుతున్న సమయంలో ఆవతలి వ్యక్తి నుంచి ఒక మెసేజ్ వచ్చింది. మంచివాడిగానే మొదట ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. చాలా బాగా ఆడుతున్నావ్ అంటూనే మీరు మేల్, ఫీమేల్‌నా అంటూ జెండర్ గురించి మెసేజ్ చేశాడు. ఆమె పేరు చెప్పగానే అతను ఇంకో మెసేజ్ పంపాడు. నీ నగ్న చిత్రాలను నాకు పంపగలవా..? అంటూనే కాస్త బెదిరించేలా మెసేజ్ చేశాడు. ఆ సమయంలో వెంటనే నా కూతురు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి, వెళ్లి నా భార్యతో చెప్పింది. ఇలాంటివి సైబర్ నేరంలో ఒక భాగం.. తల్లిదండ్రులు కూడా ఇలాంటి విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. మహారాష్ట్రలో ఏడవ తరగతి నుంచే పిల్లలకు ఈ నేరాల గురించి తెలియాలి. అందుకోసం ప్రతి స్కూల్లో సైబర్ పీరియడ్ అని ఒక గంట సమయం కేటాయించాలని ముఖ్యమంత్రిని అభ్యర్థిస్తున్నాను. ఈ నేరాన్ని ఆపడం చాలా ముఖ్యం..." అని అక్షయ్ వెల్లడించారు. ఆన్‌లైన్ వీడియో గేమ్స్ ఆడుతున్నప్పుడు మీరు కూడా ఆవతల మరో వ్యక్తితో ఆడుతున్నారనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని తన కుమార్తె ఘటనను అక్షయ్ గుర్తుచేశారు.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**